ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



పెద్దపల్లి

జిల్లా వార్తలు

5★

ఆదివారం 3 మార్చి 2024

జలాశయాలపై 800మెగావాట్ల సోలార్ ప్లాంట్లు 8లో..

నిరుపయోగంగా ఆర్అండ్బీ విశ్రాంతి గృహం 8లో..



పంటల బీమాకు గ్రీన్ సిగ్నల్

- గత ప్రభుత్వ హయాంలో నిలిపివేత
- వచ్చే సీజన్ నుంచి రాష్ట్రంలో అమల్లోకి
- రైతులకు ధీమా ఇవ్వనున్న పథకం

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

పంటల బీమా పథకాన్ని అమలుచేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో రైతుల్లో ధీమా పెరుగుతున్నది. సంబంధిత అధికారులతో సీఎం శుక్రవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. గత ప్రభుత్వ హయాంలో ఈ పథకం నిలిచిపోయింది. దీంతో నాలుగేళ్లుగా రాష్ట్రంలో పంటల బీమా అమలుకు నోచుకోవడం లేదు. కేంద్ర ప్రభుత్వం అమలు చేసే ఈ పథకంలో రాష్ట్ర ప్రభుత్వం తమ వంతు ప్రీమియం సొమ్ము చెల్లించక పోవడంతో పథకం నిలిచిపోయింది. పంట నష్టం వాటిల్లినప్పుడల్లా వ్యవసాయ శాఖాధికారులు క్షేత్రస్థాయిలో సర్వే చేసి ప్రభుత్వానికి నివేదికలు సమర్పించినప్పటికీ, పంట నష్ట పరిహారాలు పూర్తిస్థాయిలో ఇచ్చిన దాఖలాలు లేవు. గడిచిన నవంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా తాము అధికారంలోకి వస్తే పంటల బీమా పథకాన్ని అమలుచేస్తామని కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో పేర్కొన్నది. ఆ పార్టీ అధికారంలోకి రావడంతో రైతుల్లో ఆశలు చిగురించాయి. ఆ మేరకు సీఎం కేసీఆర్ వచ్చే సీజన్ నుంచే పథకాన్ని అమల్లోకి తీసుకరావాలన్నారు. రైతులు పండించిన పంటలు ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్టం వాటిల్లితే వారిని ఆదుకునేందుకు 2016-17లో కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకాన్ని ప్రారంభించింది. ఆయా పంటల వారీగా చెల్లించే బీమా ప్రీమియం మొత్తంలో 25 శాతం రైతులు, 25 శాతం రాష్ట్ర ప్రభుత్వం, 50శాతం కేంద్ర ప్రభుత్వం చెల్లించే విధంగా రూపకల్పన చేశారు. ఈ పథకాన్ని గ్రామ యూనిట్‌గా అమలు చేశారు. దీనివల్ల రైతులకు పెద్దగా ప్రయోజనం చేకూరడం లేదని బీమా పథకాన్ని సవరించాలని, రైతు యూనిట్‌గా బీమాను అమలుచేయాలని అప్పటి రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ వచ్చింది. కానీ కేంద్రం నిబంధనలను సవరించకపోవడంతో 2020 వానాకాలం సీజన్ నుంచి రాష్ట్ర ప్రభుత్వం ఫసల్ బీమా యోజన పథకాన్ని నిలిపివేసింది. తమ వాటా ప్రీమియంను చెల్లించబోమంటూ చేతులెత్తేసింది. అలాగే బ్యాంకుల్లో రైతులు పంట రుణాలు తీసుకునే సమయంలోనే ఏయే పంటలు సాగు చేస్తున్నారు, ఎంత విస్తీర్ణంలో సాగు చేస్తున్నారు, వాటికి చెల్లించే పంటల బీమా ప్రీమియంలో రైతు వాటాను మినహాయించుకుని బీమా కంపెనీకి, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వివరాలను అందించేవారు. ఈ పథకం నుంచి అప్పటిప్రభుత్వం తప్పుకోవడంతో బ్యాంకర్లకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. పంట రుణాలు ఇచ్చే సమయంలో రైతులకు తెలియకుండా బలవంతంగా ప్రీమియం సొమ్మును మినహాయించుకో వద్దంటూ ఆదేశాలు జారీ చేసింది. అప్పటినుంచి రాష్ట్రంలో పంటల బీమా పథకం అమలుకావడం లేదు.

• వేలాది ఎకరాల్లో పంటనష్టం..

ప్రతి సీజన్‌లో ఆయా బీమా కంపెనీలు నోటిఫికేషన్లు జారీ చేస్తున్నప్పటికీ, నేరుగా రైతులు పంటల బీమా చేయించుకోవడం లేదు. ప్రీమియం సొమ్మును మొత్తం భరించే స్థితిలో రైతులు లేకపోవడం గమనార్హం. గడిచిన మూడేళ్లలో అకాల వర్షాలు, భారీవర్షాలు, వడగళ్ల వర్షాలు కురిసినప్పుడు వేలాది ఎకరాల్లో రైతులు పంట నష్టపోయారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం కంటి తుడుపు చర్యగా వ్యవసాయ శాఖను పంట నష్టపరిహారం నివేదికలు సమర్పించాలని ఆదేశాలు జారీచేయడం, వాళ్ల క్షేత్రస్థాయిలో పర్యటించి 33శాతానికి మించి పంట నష్టపోయిన రైతుల వివరాలను ప్రభుత్వానికి పంపించారు. కానీ ప్రభుత్వం ఎప్పుడు ఒకసారి మాత్రమే పంట నష్టపరిహారం ఇచ్చింది. గత ఏడాది మార్చి, ఏప్రిల్‌లో కురిసిన అకాల వర్షాలకు జిల్లాలో 30 వేల ఎకరాలకు పైగా పంటలకు నష్టం వాటిల్లింది. రైతులను ఓదార్చేందుకు ఖమ్మం, కరీంనగర్ జిల్లాలో పర్యటించిన అప్పటి సీఎం కేసీఆర్ ఎకరానికి 10 వేల రూపాయల పరిహారం ఇస్తామని ప్రకటించారు. ఆ మేరకు జిల్లాలో కేవలం 6 వేల ఎకరాల పైచిలుకు పంటలకు మాత్రమే 6 కోట్ల రూపాయల వరకు నష్టపరిహారాన్ని రైతుల ఖాతాల్లో జమ చేశారు. మిగతా రైతులకు పరిహారాన్ని విడుదల చేయలేదు. ప్రభుత్వం పరిహారం ఇచ్చినా, ఇవ్వకపోయినా పంటలకు బీమా సౌకర్యం కల్పిస్తేనే తమకు ప్రయోజనకరంగా ఉంటుందని రైతులు అంటున్నారు. ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు రైతు యూనిట్‌గా పంటల బీమా పథకాన్ని అమలుచేసేందుకు ప్రభుత్వం ముందుకు రావడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సీఎంఆర్ రైస్ డెలివరీ ప్రతి మిల్లు నుంచి సేకరించాలి

- అదనపు కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ లాల్

పెద్దపల్లి, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): గత వానాకాలం పంటకు సంబంధించి నిర్దేశిత సీఎంఆర్ రైస్ డెలివరీ ప్రతి మిల్లర్ దగ్గర నుంచి రాబట్టుకోవాలని అదనపు కలెక్టర్ శ్యామ్ ప్రసాద్‌లాల్ అన్నారు. శనివారం ఆయన సమీకృత జిల్లా కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో 2022-23 యాసంగి సీఎంఆర్ రైస్ బకాయిల వసూలు, 2023-24 వానాకాలం పంట రైస్ మిల్లర్ల నుంచి రాబట్టుకోవాల్సిన సిఎంఆర్ రైస్ బకాయిలు ప్రభుత్వానికి అందజేయడానికి అవలంబించాల్సిన విధానం ఎన్ఫోర్స్మెంట్ స్టాఫ్‌తో సమీక్షించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ఎట్టి పరిస్థితుల్లో ప్రతి రైస్ మిల్లర్ల దగ్గర నుంచి ప్రతి రోజు వారి మిల్లింగ్ కెపాసిటీ బట్టి సీఎంఆర్ డెలివరీ చేయాలని, అలాచేయని మిల్లర్లపై కఠినంగా వ్యవహరించి వారివద్ద ఉన్న ధాన్యాన్ని సక్రమంగా నడిపిస్తున్న మిల్లుకి షిఫ్టింగ్ చేయాలని ఆదేశించారు. ప్రజా పంపిణీ వ్యవస్థ పట్ల జాగ్రత్తగా వ్యవహరించి రేషన్ దుకాణాల ద్వారా పేదలకు బియ్యాన్ని సరఫరా చేయాలని, ప్రజాపంపిణీ వ్యవస్థ సంబంధించిన బియ్యాన్ని ఎవరైనా అక్రమంగా దారి మళ్లిస్తే వారిపై కూడా కఠినంగా వ్యవహరించి కేసులు పెట్టాలని ఆదేశించారు. ఎన్ఫోర్స్మెంట్ స్టాఫ్ విధిగా వారి బాధ్యతలు నిర్వహించి నియమబద్ధంగా టూర్ డైరీ సమర్పించి వారి టార్గెట్ ప్రకారంగా రైస్ మిల్లుల్ని, రేషన్ షాపుల్ని తనిఖీ చేసి ప్రజా పంపిణీ వ్యవస్థని సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు.

మెగా లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలి

- జిల్లా అదనపు న్యాయమూర్తి టీ శ్రీనివాసరావు



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అదనపు న్యాయమూర్తి శ్రీనివాసరావు

కోల్‌సిటీ, మార్చి 2: కేసుల సత్వర న్యాయం కోసం ఈ నెల 16న నిర్వహించే జాతీయ మెగా లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని గోదావరిఖని అదనపు జిల్లా న్యాయమూర్తి టీ శ్రీనివాసరావు అన్నారు. శనివారం జిల్లా న్యాయస్థానంలో జరిగిన లోక్ అదాలత్ సన్నాహక సమావేశంలో గోదావరిఖని సబ్ డివిజన్ పోలీసులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోక్ అదాలత్‌తో సత్వర న్యాయం జరుగుతుందని, సయోధ్య కుదుర్చుకునే కేసులను పోలీస్ స్టేషన్ల వారీగా గుర్తించి జాబితాను తయారు చేయాలని 16న జరిగే లోక్ అదాలత్‌ను సమిష్టిగా విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో గోదావరిఖని 1, 2 అదనపు న్యాయమూర్తులు దుర్గం గణేష్, వెంకటేష్, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు నంది రవీందర్, నహీద పర్వీన, గోదావరిఖని ఏసీపీ మడక రమేష్, వన్‌టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి, టుటౌన్ సీఐ రవీందర్, రామగుండం సీఐ అజయ్‌బాబు, మంథని సీఐ సుబ్బారెడ్డితో పాటు రామగుండం ఎస్ఐ కందునూరి సతీష్, ఎన్‌టీపీసీ ఎస్ఐ ఉదయ్‌కిరణ్, స్వామి, వెంకటస్వామి, కోర్టు కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

పల్స్‌పోలియోకు ఏర్పాట్లు పూర్తి : డీఎంహెచ్‌వో

పెద్దపల్లి టౌన్, మార్చి 2: పల్స్ పోలియో కార్యక్రమాన్ని ఈనెల 3న ఆదివారం పకడ్బందీ ఏర్పాట్లు చేశామని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కె ప్రమోద్ కుమార్ తెలిపారు. శనివారం ఆయన తన ఛాంబర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ భారతదేశం పోలియోరహిత దేశమని, కాని కొన్ని దేశాల్లో పోలియో ఇప్పటికీ ఉందని, మళ్లీ తిరిగి రావచ్చనన్నారు. పిల్లలకు రక్షణ కల్పించడంలో అశ్రద్ధ చేయకుండా, పిల్లలకు పోలియో చుక్కలు ప్రతిసారి వేయించి పోలియోపై విజయం సాధించుటకు తోడ్పాటును అందించాలని ప్రజలను కోరారు. ఈనెల 3న అప్పుడే బిడ్డ నుంచి మొదలుకుని ఐదేళ్ల లోపు పిల్లలకు పోలియో చుక్కలను వేసేందుకు 381 కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. 62,700 మంది పిల్లలు ఉన్నట్లు గుర్తించామన్నారు. ఆదివారం పోలియో చుక్కలు వేయించుకోలేని వారిని 4, 5 తేదీల్లో తమ సిబ్బంది ఇంటింటికి తిరిగి చుక్కలు వేస్తారని చెప్పారు. సమావేశంలో జిల్లా ఇమ్యూనైజెషన్ అధికారి డాక్టర్ పి.కృపాబాయి పాల్గొన్నారు.

గ్రూప్1 ప్రిలిమ్స్ ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

పెద్దపల్లి కల్చరల్, మార్చి 2 : రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నడుస్తున్న బీసీ స్టడీ సర్కిల్ ద్వారా గ్రూప్ 1 ప్రిలిమ్స్‌కు ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు కరీంనగర్ బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ డాక్టర్ రవికుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని గ్రూప్1 నిరుద్యోగ అభ్యర్థులందరూ ఇట్టి ఉచిత శిక్షణ అవకాశాన్ని నేరుగా వచ్చి మార్చి 7లోగా కరీంనగర్ బీసీ స్టడీ సర్కిల్లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. తల్లిదండ్రుల వార్షిక ఆదాయం 5లక్షలకు మించవద్దని, దరఖాస్తుదారులు తప్పనిసరిగా డిగ్రీ 50 శాతం మార్కులతో ఉత్తీర్ణులై ఉండాలని, కులం, ఆదాయం, ఆధార్‌కార్డు, పాస్‌పోర్టుసైజ్ ఫోటో, గ్రూప్1 దరఖాస్తు రసీదు ఫారంలతో దరఖాస్తు చేసుకోవాలని, మరింత సమాచారం కోసం 0878-2268686 ఫోన్ నంబరులో సంప్రదించాలని ప్రకటనలో తెలిపారు.

మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యం

- రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

కోల్‌సిటీ, మార్చి 2: రామగుండం ప్రజలకు మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యంగా పెట్టుకున్నట్టు ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ అన్నారు. శనివారం కార్పొరేషన్ పరిధిలోని 26వ డివిజన్‌లో రూ.8లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత పాలకులు రామగుండం అభివృద్ధిని మరిచిపోయారని, తాను ఎమ్మెల్యే అయిన తరువాత రామగుండం కార్పొరేషన్ అభివృద్ధికి రూ.126కోట్లు మంజూరు చేయించడం జరిగిందని తెలిపారు. త్వరలోనే ఆ అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టనున్నట్టు, రామగుండం ప్రజలకు రోడ్లు, తాగునీరు, విద్యుత్ సౌకర్యాలు అందించడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని చెప్పారు. త్వరలోనే రామగుండంలో ఉన్న పెండింగ్ పనులను పూర్తి చేయాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో మేయర్ బంగి అనీల్ కుమార్, కార్పొరేటర్లు దయాకర్, బొంతల రాజేష్, మహంకాళి స్వామి, ఎండీ ముస్తాఫా, నాయకులు కాల్వ లింగస్వామి, దాసరి సాంబమూర్తి, ఉమాదేవి, పెద్దెల్లి ప్రకాష్, గడ్డం శ్రీనివాస్, గుంపుల తిరుపతి, ఫజల్ బేగ్, నాయిని ఓదెలు, కొప్పుల శంకర్, బొమ్మక రాజేష్ పాల్గొన్నారు.

పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు మద్దతు

- తెలంగాణ బీసీ ఫెడరేషన్ కులాల సమితి

పెద్దపల్లి టౌన్, మార్చి 2: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి మా సంపూర్ణ మద్దతు ఇస్తామని తెలంగాణ బీసీ ఫెడరేషన్ కులాల సమితి రాష్ట్ర అధ్యక్షులు బెల్లపు దుర్గారావు, ప్రధాన కార్యదర్శి కీర్తి యుగంధర్ తెలిపారు. పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గ కన్వీనర్ రామగిరి లింగయ్య అధ్యక్షతన పెద్దపల్లి ప్రెస్‌క్లబ్‌లో పార్లమెంట్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన బెల్లపు దుర్గారావు, కీర్తి యుగంధర్ పార్లమెంట్ కమిటీని ప్రకటించారు. పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గ ఇంచార్జిగా గుడ్ల సమ్మయ్య, కన్వీనర్ గా డాక్టర్ రామగిరి లింగయ్య, కో కన్వీనర్లుగా ఆశాడపు లింగయ్య, డాక్టర్ కేటీపీ రవీందర్, సూత్రపు పరమేశ్వర్, కావేటి సమ్మయ్య, సిహెచ్ యాదమ్మ, పిట్ల లక్ష్మి, అంజయ్య చారిలను నియమించినట్లు ప్రకటించారు. త్వరలో పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల సమావేశాలు నిర్వహిస్తామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సలహాదారు అంబటి రవీందర్ రాజు, నాయి బ్రాహ్మణ సంఘం పెద్దపల్లి పట్టణ అధ్యక్షులు సొన్నాయిటెంకం సురేష్, సొన్నాయిటెంకం తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

జీరో బిల్లు రాని వినియోగదారులు దరఖాస్తు చేసుకోవాలి

ధర్మారం,మార్చి2: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టి అమలు చేస్తున్న గృహజ్యోతి పథకం ద్వారా జీరో బిల్లు రాని విద్యుత్ వినియోగదారులు ఆధార్ కార్డు, తెలుపు రేషన్‌కార్డు, కరెంట్ బిల్లు యుఎస్సీ నంబర్‌తో మండల పరిషత్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని ట్రాన్స్‌కో ఏఈ ఖాశీం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తుదారులు అర్హులైతే ఎన్‌పీడీసీఎల్ పోర్టల్‌కు వారి పేరు వస్తోందని, ఎన్‌పీడీసీఎల్ పోర్టల్‌కి పేరు, యుఎస్సీ నంబర్ వచ్చాక ఈనెలలో వారికి ఇంతకు ముందే కరెంట్ బిల్లు వచ్చినట్లైతే వారి బిల్లు రివైజ్ చేసి జీరో బిల్లు ఇవ్వబడుతుందని, ఎవరూ ఆందోళన చెందవద్దని ఆయన కోరారు.

శ్రీపాదరావు సేవలను గుర్తించడం హర్షణీయం

- రూ.125 కోట్లతో గోదావరినదిపై మంథని-శివ్వారం బ్రిడ్జి నిర్మాణం - ప్రతి నియోజకవర్గ కేంద్రంలో అంబేద్కర్ నాలెడ్జ్ స్టడీ సెంటర్లు - మంథని ప్రాంతంలో ప్రతి ఎకరానికి సాగునీరందించడానికి చర్యలు - మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు



మంథనిలో శ్రీపాదరావు విగ్రహానికి నివాళులర్పిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు



ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న శ్రీధర్‌బాబు

మంథని, మార్చి 2: పేద, బడుగుబలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన మాజీ స్పీకర్ స్వర్గీయ శ్రీపాదరావు జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం హర్షణీయం మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. మాజీ స్పీకర్ శ్రీపాదరావు జయంతి సందర్భంగా రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మంథని పట్టణంలో శ్రీపాద చౌరస్తా వద్దగల శ్రీపాదరావు విగ్రహానికి పూలమాలలు వేసి శనివారం ఘనంగా నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రానికి సంబంధించిన అరుదైన నాయకులలో శ్రీపాదరావు ఒకరని, వారి సేవలను గుర్తించి జయంతి కార్యక్రమాన్ని అధికారికంగా నిర్వహించాలని ప్రభుత్వ విప్‌లు అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఆది శ్రీనివాస్, ఎమ్మెల్యేలు విజయరమణారావు, మక్కన్‌సింగ్‌రాజ్‌ఠాకూర్‌లు సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్కల దృష్టికి తీసుకువెళ్లారని, వారి కోరికను అంగీకరించిన ప్రభుత్వం జయంతి వేడుకలను అధికారికంగా నిర్వహిస్తోందన్నారు. బడుగుబలహీన వర్గాల అభ్యున్నతి కోసం కృషి చేసిన నాయకుడు శ్రీపాదరావు అని, ఆయన ఉమ్మడి రాష్ట్ర శాసనసభ స్పీకర్‌గా సమర్థవంతంగా విధులు నిర్వహించారన్నారు. అలాంటి శ్రీపాదరావు జయంతి వేడుకలను అధికారికంగా నిర్వహించాలని నిర్ణయించిన సీఎం, డిప్యూటీసీఎం, సహచర మంత్రులకు, వేడుకలు నిర్వహించాలని కోరిన అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. మంథని ప్రాంత ప్రజల ఆశీర్వాదం మేరకు తనకు శాసన సభ్యుడిగా అవకాశం కలిగిందని, తమ నాయకులు సోనియాగాంధీ, రాహుల్ గాంధీ, మల్లికార్జున్ ఖర్గే మంత్రివర్గంలో తనకు స్థానం కల్పించి ఈ ప్రాంతానికి మరింత సేవ చేసే అవకాశం కల్పించారన్నారు. విద్య, వైద్యం, ఉపాధిపరంగా ఈప్రాంతంలో నివసించే అనేక మందికి మేలు చేసేందుకు కృషి చేస్తానన్నారు. మంథని రైతులకు సాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలనేది శ్రీపాదరావు లక్ష్యమని, దానిని నెరవేర్చే దిశగా ఇక్కడ చిన్న లిఫ్ట్ ఏర్పాటు చేయాలని, కాళేశ్వరం ప్రాజెక్టులో ఆ లిఫ్ట్ లేకపోవడంతో ఈ ప్రాంత ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. మంథని ప్రాంత రైతుల ప్రయోజనార్థం వేగవంతంగా అవసరమైన లిఫ్ట్ ఏర్పాటు చేసి శాశ్వత పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఎస్సారెస్పీ నీరు చివరి ఆయకట్టు వరకు రాకపోవడంతో ఇబ్బందులు వస్తున్నాయని, పైన ఉన్న రైతులు నీరు వాడుతున్నారని, దీనివల్ల చివరి రైతులు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. దీనిని నివారించే దిశగా అధికారులు అవసరమైన చర్యలు తీసుకోవాలని, ప్రతి రైతుకు అవసరమైన మేర సాగునీరు అందించాలని, నీటి దుర్వినియోగం జరగకుండా చూడాలని మంత్రి అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. మంథని నుంచి శివ్వారం వరకు గోదావరినదిపై రూ.125 కోట్లతో బ్రిడ్జి నిర్మాణం పూర్తి అయిన తరువాత మంథని పట్టణం వాణిజ్యపరంగా మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. ప్రజా సంక్షేమం అభివృద్ధి దిశగా పాలన సాగిస్తున్న ప్రభుత్వంపై సంఘవిద్రోహులు చేసే అసత్య ప్రచారాలకు చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. ఇళ్లు లేని వారికి ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద లబ్ధికి త్వరలో నాంది పలుకుతామని, పైరవీలకు తావులేకుండా అర్హులకు మాత్రమే లబ్ధి చేకూర్చే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వంలో ఉన్న ఖాళీలను భర్తీ చేసేందుకు నోటిఫికేషన్లు జారీ చేశామని, మెరిట్ విద్యార్థులకు మాత్రమే ఉద్యోగాలు లభిస్తాయని, ఎటువంటి పైరవీలకు ఆస్కారం ఉండదన్నారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో బాబా సాహెబ్ అంబేద్కర్ నాలెడ్జ్ సెంటర్లను ఏర్పాటు చేసి పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థులకు అవసరమైన శిక్షణ ఉచితంగా అందిస్తామన్నారు. అనంతరం రావులచెరువు వద్ద ఉన్న శ్రీపాదరావు విగ్రహానికి మంత్రి పూలమాలలు వేసి నివాళులర్పించారు. యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో విద్యార్థినులకు దుప్పట్లు పంపిణీ చేశారు. మంథనిలోని సామాజిక ఆసుపత్రిలో పండ్లు పంపిణీ చేశారు. మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. అలాగే అన్నదానం చేశారు. ఈకార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌లాల్, కాంగ్రెస్ పార్టీ నేతలు శశిభూషన్‌కాచే, వొడ్నాల శ్రీనివాస్, ఐలి ప్రసాద్, పెంద్రు రమాదేవీ -సురేష్‌రెడ్డి, పేరవేన లింగయ్యయాదవ్, పోలు శివ, బండారి ప్రసాద్, ఎంపీపీ కొండ శంకర్, ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

సబ్బండ వర్గాలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండ



సమావేశంలో మాట్లాడుతున్న విజయరమణారావు



జీరో కరెంట్ బిల్లును అందజేస్తున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

ఎలిగేడు, మార్చి 2 : సబ్బండ వర్గాల ప్రజలకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. ఎలిగేడు మండల కేంద్రంలో శనివారం కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన 6గ్యారంటీలలో భాగంగా గృహజ్యోతి 200యూనిట్ల ఉచిత కరెంట్ పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ నాయకురాలు జడ్పీ వైస్ చైర్‌పర్సన్ బండిగ రేణుక ఇంటి కరెంట్ మీటర్ బిల్లు 200యూనిట్లకు సుమారు రూ.700బిల్లుకు జీరో కరెంటు బిల్లు రావడం జరిగిందని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రెండు హామీలు అమలుచేయడం జరిగిందని, మరో రెండు హామీలు రూ.500లకే గ్యాస్ పథకం, 200యూనిట్లలోపు విద్యుత్ వినియోగదారులకు ఉచిత విద్యుత్‌ను అందించే కార్యక్రమాన్ని ప్రారంభించారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర యువజన కార్యదర్శి దుగ్యాల సంతోష్‌రావు, మండల అధ్యక్షుడు సామ రాజేశ్వర్‌రెడ్డి, ఎంపీపీ స్రవంతిమోహన్‌రావు, జడ్పీవైస్‌చైర్ పర్సన్ మండిగా రేణుక పిఎసిఎస్ చైర్మన్ గోపు విజయభాస్కర్‌రెడ్డి, డీఈ తిరుపతి, ఏడీఈ వెంకటేశ్వర్లు, ఏఈ సంపత్‌రెడ్డి, మాజీ సర్పంచ్ బూర్ల సింధూజ, నరహరి సుధాకర్‌రెడ్డి, కొరుకంటి వెంకటేశ్వర్‌రావు పాల్గొన్నారు.

అంతర్గాం : రామగుండం పట్టణంలోని 21వ డివిజన్ పరిధి సండే మార్కెట్ వద్ద శనివారం స్థానిక రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ గృహ జ్యోతి పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కాలనీలో పలు గృహాలను సందర్శించి గృహ జ్యోతి పథకంలో భాగంగా 200యూనిట్ల వరకు మీటర్ రీడింగ్ బిల్లులను పంపిణీ చేశారు.


ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ అమ్రీన్ ఫాతిమా సలీంబేగ్, నాయకులు బందారపు బుగ్గ రాములుగౌడ్, పెండ్యాల మహేష్, ఉరిమెట్ల రాజలింగం, ఈదునూరి హరి ప్రసాద్, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.











నకిలీ చిరునామా కేసులో మీ సేవా కేంద్రం నిర్వాహకుడు, మరొకరి అరెస్ట్

సిరిసిల్ల క్రైం, మార్చి 2: నకిలీ చిరునామాతో పాస్‌పోర్టుకు దరఖాస్తు చేసిన కేసులో రుద్రంగి మండల కేంద్రంలో గల గాయత్రి మీ సేవా కేంద్రం యజమాని లోలావత్ పరమజిత్‌ను, కథలాపూర్ మండలం కలికోట గ్రామానికి చెందిన దరావత్ షెర్మాన్‌ను శనివారం అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించామని ఎస్పీ అఖిల్ మహాజన్ ఒక ప్రకటనలో తెలిపారు. వీరి వద్ద నుంచి కంప్యూటర్, స్కానర్, ప్రింటర్, ఒరిజినల్, నకిలీ ఆధార్‌కార్డు స్వాధీనం చేసుకున్నామన్నారు. వీరు పాస్‌పోర్ట్ దరఖాస్తు విషయంలో తప్పుడు ధ్రువపత్రాలు సృష్టించి ప్రభుత్వ ఉద్యోగులను తప్పు దోవ పట్టించారని తెలిపారు. కథలాపూర్ మండలంలోని కలికోట గ్రామానికి చెందిన దరావత్ షెర్మాన్ అనే వ్యక్తి గతంలో ఉపాధి నిమిత్తం విదేశాలకు వెళ్లి అక్కడ జైలు శిక్ష అనుభవించాడు. తిరిగి స్వదేశానికి వచ్చి ఎలాగైనా మళ్లీ విదేశాలకు వెళ్లాలని పాస్‌పోర్ట్‌కోసం మీసేవా కేంద్రం ద్వారా దరఖాస్తు చేసుకున్నాడు. ఇందులో భాగంగా స్పెషల్ బ్రాంచి పాస్‌పోర్ట్ ఎంక్వైరీలో భాగంగా షెర్మాన్ సమర్పించిన పత్రాలు అనుమానంగా భావించి సంబంధిత కానిస్టేబుల్ దేవరాజు రుద్రంగి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ ఫిర్యా దు మేరకు విచారణ చేపట్టగా రుద్రంగిలోని గాయత్రి మీసేవా కేంద్రం నిర్వాహకుడు లోలావత్ పరమజిత్ ద్వారా ఆధార్ కార్డులో షెర్మాన్‌కు బదు లుగా షెర్మాన్‌నాయక్ అని చిరునామా కలికోట గ్రామానికి బదులుగా రుద్రం గిగా మార్చడమే కాకుండా విద్యార్హతలు, పుట్టిన తేదీలు మార్చి పాస్‌పోర్ట్ కోసం దరఖాస్తు చేశారని ఆయన తెలిపారు. ఈ విధంగా నకిలీ చిరునామా పెట్టి దరఖాస్తు చేసిన వ్యక్తితో పాటు మీసేవా కేంద్రం నిర్వాహకుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని ఆయన తెలిపారు.

52మంది మందుబాబులకు జైలు శిక్ష, జరిమానా

సిరిసిల్ల క్రైం, మార్చి 2: సిరిసిల్ల పట్టణంలో డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన 52మంది మందుబాబులకు జైలుశిక్ష, జరిమానా విధిస్తూ సిరిసిల్ల ప్రథమ శ్రేణి న్యాయమూర్తి ప్రవీణ్ శనివారం తీర్పు ఇచ్చారని టౌన్ సీఐ రఘుపతి తెలిపారు. మద్యం తాగి వాహనాలు నడిపి పట్టుబడిన 26మందికి ఒక్కొక్కరికి రెండురోజుల జైలు శిక్షతో పాటు మూడువేల రూపాయల జరిమానా విధించారని తెలిపారు. మరో 25మంది మందుబాబులకు ఒక్కొక్కరికి మూడు వేల రూపాయల చొప్పున జరిమానా విధించారని తెలిపారు. మందుబాబులకు కౌన్సెలింగ్ నిర్వహించినట్లు తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడిపి పట్టుబడితే భవిష్యత్తులో వచ్చే ఉద్యోగ అవకాశాలు, ఉపాధి అవకాశాలకు ఇబ్బందులు తలెత్తుతాయన్నారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.









పోలీస్ కస్టడీలో అక్షర చిట్‌ఫండ్ ఛైర్మన్, డైరెక్టర్లు

కరీంనగర్ క్రైం, మార్చి 2: ఖాతాదారులకు సకాలంలో డబ్బు చెల్లించకుండా మోసగించి చిట్‌ఫండ్ కంపెనీలో ఖాతాదారులు జమచేసుకున్న డబ్బుతో సొంత ఆస్తులు కూడబెట్టిన కేసులో అక్షర చిట్‌ఫండ్ ఛైర్మన్ పేరాల శ్రీనివాసరావు, ఎస్ కొండాల్‌రావు, ఉప్పల రాజేందర్‌లను ఒకటవ టౌన్ పోలీసులు ఆరు రోజుల కస్టడీకి తీసుకుని విచారిస్తున్నారు. సీతారాంపూర్‌కు చెందిన ప్రభుత్వ ఉద్యోగి శ్రీరాం వెంకట్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదుతో ఫిబ్రవరి 21న అక్షర చిట్‌ఫండ్ ఛైర్మన్, డైరెక్టర్లపై కేసు నమోదు చేసిన వన్‌టౌన్ పోలీసులు వారిని అదే రోజు అరెస్టు చేసి జైలులో రిమాండ్‌కు తరలించారు. ఈ కేసుకు సంబంధించిన మరిన్ని కీలక ఆధారాలు సేకరించేందుకు నిందితుల్లో ముగ్గురిని పోలీసులు కోర్టు ద్వారా శుక్రవారం సాయంత్రం కస్టడీకి తీసుకున్నారు. ఈ నెల 6వ తేదీ సాయంత్రం వరకు వీరిని విచారించనున్నారు. కరీంనగర్ రాజీవ్‌చౌక్, కోతిరాంపూర్, జ్యోతినగర్‌లలో ఉన్న అక్షర చిట్‌ఫండ్ బ్రాంచీలలో తనిఖీలు నిర్వహించి పలు కీలక డాక్యుమెంట్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకుల మృతి

గంగాధర, మార్చి 2: కారు ఇంటి పిల్లరును ఢీకొన్న ఘటనలో గంగాధర మండలం కాచిరెడ్డిపల్లికి చెందిన ఇద్దరు యువకులు మృతి చెందారు. గ్రామస్థుల వివరాల ప్రకారం...గ్రామానికి చెందిన కోల విక్రమ్(31), కుంట రమేష్(32)లతో పాటు మరో ఇద్దరు శనివారం వేకువ జామున కారులో తిరుపతి దర్శనానికి బయలు దేరారు. వీరు ప్రయాణిస్తున్న కారు సూర్యాపేట జిల్లా తిరుమలగిరిలో ఓ ఇంటి పిల్లరును ఢీకొట్టింది. ఈ ఘటనలో కుంట రమేష్ అక్కడి కక్కడే మృతి చెందగా విక్రమ్ చికిత్స పొందుతూ మృతి చెందాడు. కారులోని మరో ఇద్దరికి తీవ్రంగా గాయాలైనట్లు సమాచారం. ఇద్దరు యువకుల మృతితో గ్రామంలో విషాదం అలుముకుంది.

ద్విచక్రవాహనాలు ఢీకొని ఒకరి మృతి

పెద్దపల్లి రూరల్,మార్చి 2 : మండలంలోని రంగాపూర్ గ్రామ శివారులో ద్విచక్రవాహనాలు ఢీకొని సూర్నపల్లి రాజయ్య (56) మృతిచెందాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం సబ్బితం గ్రామానికి చెందిన సూర్నపల్లి రాజయ్య స్వగ్రామం నుంచి పెద్దపల్లికి ద్విచక్రవాహనంపై వస్తుండగా మరొకరు రంగాపూర్ గ్రామ శివారులో ద్విచక్రవాహనంతో వెనుకనుండి ఢీకొట్టాడు. రాజయ్య తలకు తీవ్ర గాయాలు కాగా పెద్దపల్లి ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం కరీంనగర్ తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందినట్లు తెలిపారు. మృతుని కుమారుడు సతీష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు బసంత్‌నగర్ ఎస్ఐ స్వామి తెలిపారు.

కుటుంబ పాలన, కుంభకోణాలతో రాష్ట్రం కుదేలు

- అబద్దాల పునాదులపై పురుడు పోసుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం
- దేవుణి మాన్యాలను కబ్జా చేస్తే బీజేపీ చూస్తూ ఊరుకోదు
- బీజేపీ ఫ్లోర్ లీడర్, నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి



వేములవాడలో మాట్లాడుతున్న నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

వేములవాడ టౌన్, మార్చి 2: కుటుంబ పాలన, కుంభకోణాలతో రాష్ట్రం కుదేలైందని బీజేపీ ఫ్లోర్ లీడర్, నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. ప్రపంచ దేశాల్లో భారత్‌కు ప్రత్యేక గుర్తింపు వచ్చిందంటే ప్రధాన మోదీతోనేనని, ప్రపంచ దేశాల్లోనే భారత్ మూడవ ఆర్థిక వ్యవస్థగా ఎదగబోతుందంటే ప్రధాని మోదీ సంకల్పానికి నిదర్శనమన్నారు. దేశంలో రాబోయేది రామరాజ్యమని మహేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రజాసంగ్రామ యాత్ర ముగింపు కార్యక్రమంలో భాగంగా వేములవాడకు వచ్చిన ఆయన సమావేశంలో మాట్లాడారు. విజయ సంకల్ప యాత్ర ఒక కొత్త మలుపునకు నాంది పలికిందని అన్నారు. రాజకీయ చరిత్రలో వేడిపుట్టించిందని, రాష్ట్రంలో అత్యధిక సీట్లు గెలువబోతున్నామని విశ్లేషకులు చెబుతున్నారని అన్నారు. వేములవాడకు వచ్చిన తరువాతనే ఓ శుభవార్త తెలిసిందని, రాష్ట్రంలో 9 మంది అభ్యర్థులను ప్రకటించగా కరీంనగర్ ఎంపీ అభ్యర్థిగా బండి సంజయ్ పేరు ఖరారు చేశారని వెల్లడించారు. సుమారు 2 లక్షల మెజార్టీతో బండి సంజయ్ గెలువబోతున్నాడని ఆశాభావం వ్యక్తం చేశారు. ఎన్నో యేళ్లుగా రాష్ట్రం కుటుంబ పాలనతో విసుగిపోయిందన్నారు. పీసీసీ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు రేవంత్‌రెడ్డి కాళేశ్వరం ప్రాజెక్టులో లక్షల కోట్ల కుంభకోణం జరిగిందని ప్రగల్భాలు పలికి అధికారంలోకి వచ్చిన తరువాత సీబీఐ ఎంక్వైరీ కోసం ఒక్క లెటర్ ఇవ్వమంటే ఎందుకు ఇవ్వలేరని విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డికి కాళేశ్వరం ప్రాజెక్టులో ఎవరైనా బంధువులు, మిత్రులు కానీ ఉన్నారా అని ప్రశ్నించారు. నాకు ఒక్క లెటర్ ఇస్తే 48 గంటల్లో సీబీఐ ఎంక్వైరీ పెట్టిస్తానని, దమ్ముంటే ఒక్క లేటర్ ఇవ్వు రేవంత్‌రెడ్డి అని సవాల్ విసిరారు. అధికారం చేజిక్కించుకునేందుకు నోటికి వచ్చిన అబద్దాలు చెపుతూ అధికారంలోకి వచ్చారని, కేవలం బ్లాక్‌మెయిల్ చేయడం కోసమే ముఖ్యమంత్రి పదవి తీసుకున్నాడని ఆరోపించారు. నాలుగు వందల పైచిలుకు హామీలను ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్క హామీ కూడా అమలు చేయలేదని అన్నారు. ఆరు గ్యారంటీల పేరు చెప్పి నాలుగు అమలు చేశామని అంటున్నారు. అది సాధ్యం కాదని ఆరు గ్యారంటీలు అమలు జరగాలంటే రూ.1.65 లక్షల కోట్లు కావాలని, కానీ రూ.53 వేల కోట్లు మాత్రమే కేటాయించారని అన్నారు. గ్యారంటీల అమలు ఎలా జరుగుతుందని ప్రశ్నించారు. మహిళలకు రూ.2500 ఇస్తామని, నిరుద్యోగ యువతకు భృతి ఇస్తామని అసెంబ్లీలో మాట్లాడలేదని, వాటిపై తాను ప్రశ్నిస్తే ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క మేము హామీ ఇవ్వలేదని మాట దాటవేసిన మహనీయులు అని ఎద్దేవా చేశారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ గాడితప్పి అతలాకుతలం అవుతుందని, ప్రధాని మోదీ రూ. 9 వేల కోట్లు ఇస్తేనే ప్రభుత్వం వడ్డీలు, జీతాలు వెల్లదీస్తోందన్నారు. అలాంటి మోదీని విమర్శించే అర్హత రేవంత్‌రెడ్డికి లేదని అన్నారు. మరో మారు ప్రధానిని విమర్శిస్తే ఖబడ్దార్ అని హెచ్చరించారు. గత ప్రభుత్వ హయాంలో రంగారెడ్డి జిల్లా చేవెళ్లలో సీతారాములకు సంబంధించిన 11 వందల ఎకరాలను దేవుడి మాన్యాన్ని అక్కడున్న రంజిత్‌రెడ్డి, కేటీఆర్ కలిసి ప్రభుత్వ ఆధినంలోకి తీసుకుని ఇండస్ట్రియల్ పేరుతో రూ.20 లక్షల నుంచి రూ. 15 లక్షలకు ఎకరం కేటాయించి కమిషన్‌లు పొందారని ఆరోపించారు. దేవుడి మాన్యాల జోలికి వస్తే ఖబడ్దార్, బీజేపీ పార్టీ ఊరుకోదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇతర మతాలకు చెందిన వారి దేవుళ్లకు చెందిన భూమిని తీసుకునే దమ్ము పాలకులకు ఉందా అని ప్రశ్నించారు. హైదారాబాద్ నడిబొడ్డు లోని జూబ్లీహిల్స్‌లో అక్కడి ఎంపీ అని చెప్పుకుని తిరిగే రంజిత్‌రెడ్డి 400 ఎకరాల హనుమాన్ దేవాలయాన్ని కూలగొట్టి అక్కడి భూమిని కబ్జా చేసి అపార్ట్‌మెంట్ నిర్మాణం చేస్తున్నాడని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి దమ్ము ధైర్యం వుంటే ఆధారాలతో సహా ఇస్తాను దాన్ని నిలిపివేసి దేవాలయానికి కేటాయించాలని డిమాండ్ చేశారు. నిర్మల్ నియోకవర్గంలో సైతం శ్రీకృష్ణుని చెందిన భూమి సైతం కబ్జా చేస్తే సర్వే చేసి వెలికి తీస్తున్నానని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి చెన్నమనేని వికాస్‌రావు, దీప, జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ, ఫైపాల్‌రెడ్డి, ఎర్రం మహేష్, మల్లికార్జున్, కుమ్మరి శంకర్, గురుమూర్తి శివశంకర్, సంతోష్‌బాబు, జక్కుల తిరుపతి తదితరులు ఉన్నారు.

రాజన్నను దర్శించుకున్న మహేశ్వర్‌రెడ్డి


వేములవాడ టౌన్ : వేములవాడ రాజరాజేశ్వరస్వామిని శనివారం సాయంత్రం బీజేపీ శాసనసభాపక్ష నేత నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకులు ఆశీర్వదించగా, ప్రొటోకాల్ పర్యవేక్షకులు సిరిగిరి శ్రీరాములు స్వామివారి శేషవస్త్రాన్ని కప్పి లడ్డు ప్రసాదం అందజేశారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ, నాయకులు రేగుల సంతోష్‌బాబు, నామాల శేఖర్, సగ్గు రాహుల్ ఉన్నారు.

కొనసాగుతున్న న్యూరో డాక్టర్ల రాష్ట్ర సదస్సు

సుభాష్‌నగర్, మార్చి 2: శాతవాహన న్యూరో డాక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నగరంలోని వీ కన్వెన్షన్‌లో ఈ నెల 1న ప్రారంభమైన న్యూరో డాక్టర్ల రాష్ట్రస్థాయి సదస్సు కొనసాగుతోంది. ఈ సదస్సులో శనివారం నిమ్స్ ప్రొఫెసర్ విజయసారథి పాల్గొని ప్రెజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెన్నెముక చికిత్సలో కోత లేకుండా ఎండోస్కోపీ ద్వారా శస్త్ర చికిత్సలు ఎలా చేయాలని వివరించారు. అనంతరం కిమ్స్ హాస్పిటల్ న్యూరో సర్జన్ డాక్టర్ మానస్ పాణిగ్రహీ మాట్లాడుతూ గతంలో క్యాన్సర్ ట్యూమర్ చికిత్స తీసుకోవాలంటే ఆరు వారాలు అవసరం ఉండేదన్నారు. ప్రస్తుతం రేడియో సర్జరీ ద్వారా రెండు నుంచి ఐదు రోజులు మాత్రమే చికిత్స తీసుకుంటే సరిపోతుందన్నారు. రోబోటిక్ సర్జరీ, ఎండోస్కోపీ, నావిగేషన్, ఆల్ట్రాసోనిక్, ఆస్పురేటివ్, లేజర్‌ల ద్వారా అత్యాధునిక చికిత్స అందుబాటులోకి వచ్చాయని తెలిపారు. వాటితో పాటు మైక్రోస్కోప్ సర్జరీలు అందుబాటులోకి రావడం శుభపరిణామమన్నారు. ప్రస్తుతం సర్జరీ అవసరం లేకుండానే రేడియేషన్‌తో చికిత్సలు అందుబాటులోకి వచ్చాయన్నారు. దాంతో పేషంట్ ఒక్క రోజులోనే డిశ్చార్జి అవుతున్నారని తెలిపారు. స్పైనల్ కార్డు స్టిమ్‌లెటర్ అందుబాటులోకి రావడం పక్షవాతానికి గురైన వ్యక్తులకు ఎంతో దోహదం చేస్తుందన్నారు. సీనియర్ ఫిజీషియన్ డాక్టర్ దాసరి శ్రీనివాస్ మాట్లాడుతూ కరీంనగర్‌లో రాష్ట్ర స్థాయి సదస్సు నిర్వహించడం సంతోషకరమన్నారు. న్యూరో విభాగంలో నూతనంగా వస్తున్న మెళకువలను నేర్చుకోవడానికి ఇలాంటి సదస్సులు ఎంతో దోహదపడతాయన్నారు. డాక్టర్ దాసరి వెంకటేష్ మాట్లాడుతూ రోడ్లు సరిగా లేకపోవడం, ఎక్కువ సేపు ప్రయాణాలు చేయడంతోనే వెన్నుముక సమస్యలు ఉత్పన్నమవుతాయన్నారు. వాటితోపాటు ఎక్కువసేపు ఒకే చోట కూర్చోవడం, సరైన ఆహారం తీసుకోకపోవడం, ఒత్తిడికి గురికావడం కూడా కారణమన్నారు. వైద్యుల సలహాలు, సూచనలు తీసుకుంటే ప్రాథమిక దశలోనే నివారించవచ్చన్నారు. కార్యక్రమాన్ని కరీంనగర్‌కు చెందిన సీనియర్ వైద్యులు డాక్టర్ రమణారెడ్డి, డాక్టర్ పీవీకే కిషోర్, డాక్టర్ దాసరి శ్రీనివాస్, డాక్టర్ జొన్నల శ్రీనివాస్, డాక్టర్ రంజిత్ కుమార్, డాక్టర్ సంజయ్‌లు పర్యవేక్షిస్తున్నారు.







12 వరకు ఎం ఫార్మసీ, బీ ఫార్మసీ పరీక్ష ఫీజు గడువు

గణేశ్‌నగర్, మార్చి 2:ఎస్‌యూ పరిధిలోని ఎం ఫార్మసీ మొదటి సెమిస్టర్ మూడో సెమిస్టర్ విద్యార్థులు ఎలాంటి అపరాధ రుసుం లేకుండా పరీక్ష రుసుం ఈనెల 12 వ తేదీ వరకు చెల్లించాలని పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎన్‌వి శ్రీరంగ ప్రసాద్ తెలిపారు. 300రూపాయల అపరాధ రుసుంతో 15వ తేదీ వరకు చెల్లించాలనిఅన్నారు. పరీక్షలను మార్చి లేదా ఏప్రిల్‌లో నిర్వహించనున్నట్లు తెలిపారు.

●ఎస్‌యూ పరిధిలోని బీఫార్మసీ మొదటి సెమిస్టర్, ఏడో సెమిస్టర్ (రెగ్యులర్ సప్లిమెంటరీ) రెండో సెమిస్టర్, ఎనిమిదో సెమిస్టర్(సప్లిమెంటరీ) విద్యార్థులు ఎలాంటి అపరాధ రుసుం లేకుండా పరీక్ష రుసుం ఈనెల 12వ తేదీ వరకు చెల్లించాలని పరీక్షల నియంత్రణాధికారి తెలిపారు. 300 రూపాయల అపరాధ రుసుంతో 15వ తేదీ వరకు చెల్లించాలని ఆయన అన్నారు.

రేపు ఉద్యోగాల కోసం ఇంటర్వ్యూలు

సుభాష్‌నగర్, మార్చి 2: సెక్యూరిటీస్ ప్రైవేట్ లిమిటెడ్ ఇంటర్నేషనల్ సంస్థలో 400ల ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని, ఈ నెల 4న నగరంలోని అంబేద్కర్ స్టేడియం సమీపంలోని స్వశక్తి కళాశాలలో ఉదయం 10 గంటలకు నిర్వహించే ఇంటర్వ్యూలకు హాజరు కావాలని డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. పదవ తరగతి ఆపై విద్యార్హతతో పాటు 19 నుంచి 40 సంవత్సరాల వయస్సు గల పురుష అభ్యర్థులు అర్హులన్నారు. తమ బయోడేటాతో పాటు ఆధార్‌కార్డు, విద్యార్హతల జిరాక్స్ ప్రతులు తీసుకుని ఇంటర్వ్యూకు హాజరు కావాలన్నారు. ఎంపికైన అభ్యర్థులకు 14 వేల నుంచి 21 వేల వరకు వేతనంతో పాటు ఈఎస్ఐ, పీఎఫ్ బోనస్ గ్రాట్యుటీ అందజేస్తారన్నారు.

రేపు ఎస్సారార్ కళాశాలలో జాబ్ మేళా

గణేశ్‌నగర్, మార్చి 2: ఎస్సారార్ ప్రభుత్వ ఆర్ట్స్, సైన్స్ కళాశాలలో తెలంగాణ స్కిల్స్ నాలెడ్జి సెంటర్ (టిఎస్‌కెసి) ఆధ్వర్యంలో సోమవారం ఉదయం 10గంటలకు జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ కె.రామకృష్ణ, టిఎస్‌కెసి కో-ఆర్డినేటర్ సిహెచ్ మారుతి తెలిపారు. ఈ జాబ్ మేళాలో ఆదర్శ నెక్సా షోరూం పాల్గొంటుందని తెలిపారు. డిగ్రీ పాసైన వారు అర్హులని తెలిపారు. ఇతర వివరాలకు ఎస్సారార్ కళాశాల, టిఎస్‌కెసి సెంటర్‌లో సంప్రదించాలని ఆయన సూచించారు.

ప్రైవేటీకరణ కోసమే నూతన విద్యావిధానం



సమావేశంలో మాట్లాడుతున్న నద్దునూరి అశోక్‌స్టాలిన్

భగత్‌నగర్, మార్చి 2: విద్య ప్రైవేటీకరణ కోసమే నూతన విద్యా విధానమని దీనిని ప్రజలందరూ వ్యతిరేకించాలని ఏఐఎస్ఎఫ్ జాతీయ ఉపాధ్యక్షుడు నద్దునూరి అశోక్ స్టాలిన్ అన్నారు. శనివారం కరీంనగర్‌లోని బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజ్యాంగ మౌలిక సూత్రాలకు వ్యతిరేకంగా తీసుకువచ్చిన జాతీయ విద్యా విధానం (ఎన్ఈపీ) 2020 లోపాల పుట్ట అని విమర్శించారు. విద్య కాషాయీకరణ, ప్రైవేటీకరణ, కేంద్రీకరణ కోసమే నూతన విద్యా విధానమన్నారు. రాష్ట్ర విభజన హామీలను అమలు చేయడంలో విఫలమైన కరీంనగర్ ఎంపీ ఓట్లు ఎలా అడుగుతారని ఆయన ప్రశ్నించారు. ఎన్ఈపీ రద్దుకు ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో దేశ వ్యాప్తంగా సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపడు తున్నా మన్నారు. ప్రభుత్వం విద్యను పూర్తిగా నిర్వీర్యం చేసి పేద, మధ్య తరగతి వర్గాలకు దూరం చేసే కుట్ర పన్నుతున్నాయన్నారు. దేశంలో జాతీయ విద్యావిధానం వల్ల 90శాతం మంది విద్యార్థులు నాణ్యమైన విద్యను పొందే హక్కును కోల్పోతారన్నారు. ఈ సమావేశంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రామారపు వెంకటేష్, మచ్చ రమేష్, నగర నాయకులు సందీప్‌రెడ్డి, అడపా సాయికృష్ణ, వినయ్‌రెడ్డి, అజయ్ రాహుల్, నాని, సుధీర్, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

భూ వివాదంలో బీజేపీ నాయకుడు, మరో ఇద్దరిపై కేసు

సిరిసిల్ల క్రైం, మార్చి 2: సిరిసిల్ల పట్టణంలోని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడి భూమిని నకిలీ పత్రాలు సృష్టించి అక్ర మంగా కాజేసేందుకు ప్రయత్నించడమే కాకుండా చం పుతామని బెదిరించిన సంఘటనలో బీజేపీ నాయకుడితో పాటు మరో ఇద్దరిపై సిరిసిల్ల టౌన్ పోలీస్‌స్టేషన్‌లో శనివారం కేసు నమోదైంది. సిరిసిల్ల డీఎస్పీ భీంశర్మ వివరా ల ప్రకారం.. సిరిసిల్ల పట్టణంలోని గూడూరి ప్రవీణ్‌కు చెందిన సర్వేనంబర్ 1562లో 363గజాల భూమిని అక్ర మించాలనే ఉద్దేశంతో తప్పుడు దస్తావేజులతో కె చందన భూమిని చౌటుపల్లి చంద్రశేఖర్‌కు జీపీఏ చేశారు. ఆ తర్వాత చౌటుపల్లి చంద్రశేఖర్ అదే భూమిని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డబోయిన గోపికి విక్రయించారు. గోపి ఈ భూమిలో నుంచి 180గజాల భూమిని తిరిగి కె చందన కు రిజిస్ట్రేషన్ చేశారు. భూమిని తమకు అప్పగించాలని లేకుంటే చంపుతామని బెదిరించారని బాధితుడు బీఆర్ఎస్ రాష్ట్రనాయకుడు గూడూరి ప్రవీణ్ ఫిర్యాదు చేశాడు. ఈ ఫిర్యాదు మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసి బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డబోయిన గోపిని అరెస్టుచేసి కోర్టులో హాజరుపరిచామని తెలిపారు. జిల్లాలో భూ కబ్జాలు చేస్తూ, నకిలీ పత్రాలు సృష్టించి బెదిరింపులకు పాల్పడే వారి సమాచారం ఇవ్వాలని, వారి నేర ప్రవృత్తిని ప్రజలు ధైర్యంగా పోలీసుల దృష్టికి తీసుకురావాలని ఆయన తెలిపారు.

జార్జియాలో వైద్య విద్యార్థిని మృతి


పంజాల రిచిత(ఫైల్)

హుజూరాబాద్‌రూరల్, మార్చి2: హుజూరాబాద్ మండలంలోని జూపాక గ్రామానికి చెందిన వైద్య విద్యార్థిని పంజాల రిచిత(20) అనారోగ్యంతో జార్జియాలో శనివారం మృతి చెందింది. గ్రామానికి చెందిన పంజాల రాజు కుమార్తె రిచిత జార్జియాలో ఎంబీబీఎస్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. కొద్ది రోజుల క్రితం రిచిత ఊపిరి తిత్తులకు ఇన్‌ఫెక్షన్ సోకి పరిస్థితి విషమించింది. తోటి విద్యార్థులు ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు గ్రామస్థులు తెలిపారు.

యువకుడి ఆత్మహత్య


హరీష్ (ఫైల్)

మెట్‌పల్లి రూరల్, మార్చి, 02 : మండలంలోని వెల్లుల్ల గ్రామంలో కేటీఆర్‌నగర్‌కు చెందిన నేరెళ్ల హరీష్(25) అనే యువకుడు ప్రేమ విఫలమై ఆత్మహత్య చేసుకున్నాడని ఎస్సై చిరంజీవి శనివారం తెలిపారు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం..గ్రామానికి చెందిన నేరెళ్ల హరీష్ ఓ యువతిని కొంత కాలం నుంచి ప్రేమించాడు. ఆ అమ్మాయికి వేరే వ్యక్తితో పెళ్లి కుదిరింది. ఈ క్రమంలో తాగుడుకు బానిసైన హరీష్‌ను ఫిబ్రవరి 29న మండలంలోని జగ్గసాగర్ గ్రామంలో ఉన్న బంధువుల ఇంటికి తల్లి తీసుకెళ్లింది. శనివారం ఇంట్లో ఒంటరిగా ఉన్న హరీష్ ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

మహిళ ఆత్మహత్య


శ్రీలత(ఫైల్)

జ్యోతినగర్, మార్చి 2: కొడుకు చనిపోతానని బెదిరించడంతో నువ్వు ఎందుకు చనిపోవడం కొడుకా..నేనే చనిపోతా అంటూ క్షణికావేశంలో ఓ తల్లి ఒంటిపై కిరోసిన్ పోసుకుని ఆత్మహత్య చేసుకున్న ఉదంతం ఎన్టీపీసీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ప్రగతినగర్‌లో చోటుచే సుకుంది. ఎస్ఐ ఉదయకిరణ్ కథనం ప్రకారం.. ప్రగతినగర్‌కు చెందిన పైండ్ల శ్రీలత (40) రవి దంపతులకు రాజ్‌కుమార్, అక్షితలు సంతానం, రాజ్‌కుమార్ హన్మకొండలో డిప్లమో చదువుతున్నాడు. వృధాగా డబ్బులు ఖర్చు పెడుతుండటంతో కొడుకు రాజ్‌కుమార్‌ను తల్లిదండ్రులు మందలించారు. మనస్థాపం చెందిన రాజ్‌కుమార్ తన తల్లి శ్రీలతకు ఈ నెల ఒకటిన రాత్రి ఫోన్ చేసి తన అవసరాలకు ఖర్చులకు డబ్బులు పంపించడం లేదని చనిపోతానని బెదిరించాడు. నువ్వు ఎందుకురా చని పోవడం నేనే చచ్చిపోతా అంటూ తల్లి శ్రీలత క్షణికా వేశంలో ఇంట్లో ఉన్న డీజిల్ డబ్బాలోని డీజిల్‌ను ఒంటి పై పోసుకుని నిప్పంటించుకుంది. గోదావరిఖని ప్రభుత్వ అనుపత్రికి తరలించగా అప్పటికే చనిపోందని డాక్టర్లు నిర్ధారించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

చెరువులో మునిగి పశువుల కాపరి మృతి

మెట్‌పల్లి రూరల్, మార్చి2 : మండలంలోని వేంపేట గ్రామంలో పశువుల కాపారి కోడి స్వామి(48) ప్రమాదవశాత్తు చెరువులో మునిగి శనివారం మృతి చెందినట్లు ఎస్సై చిరంజీవి తెలిపారు. మంచిర్యాల జిల్లా లక్సెట్‌పేట్ మండలంలోని కొమ్ముగూడెం గ్రామానికి చెందిన కోడి స్వామి జీవనోపాధి కోసం మండలంలోని వేంపేట గ్రామానికి కొన్ని సంవత్సరాల క్రితం కుటుంబ సభ్యులతో వచ్చాడు. శుక్రవారం పశులవులను మేపుకుంటూ గ్రామంలోని పెద్ద చెరువు సమీపం వద్దకు వెళ్లాడు. ప్రమాదవశాత్తు చెరువులో మునిగిపోయాడు. శనివారం చెరువులో కోడి స్వామి శవమై స్థానికులకు కనిపించగా కుటుంబ సభ్యులకు సమచారం అందించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

భవనంపై నుంచి పడి కార్మికుడి మృతి

కరీంనగర్ క్రైం, మార్చి 2: ప్రమాదవశాత్తు కాలు జారి భవనంపై నుంచి కింద పడిన ఒడిస్సా కార్మికుడు అజిత్‌కుమార్ వాస్(34) మృతి చెందాడని కొత్తపల్లి పోలీసులు తెలిపారు. కరీంనగర్ రేకుర్తిలోని విజయపురి కాలనీలో భూక్య రాజు అనే ఇంటి యజమాని వద్ద సహాయకుడిగా పనిచేస్తున్న అజిత్‌కుమార్ వాస్ శుక్రవారం ఉదయం ఇంటి నిర్మాణ పనుల్లో భాగంగా రెండో అంతస్తుకు వెళ్లి కాలు జారి కిందపడ్డాడు. ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందాడని పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

నెలనెలా పొదుపు డబ్బులు వసూలు చేసి మోసం


పోలీసులను ఆశ్రయించిన బాధితులు

వీర్నపల్లి (ఎల్లారెడ్డిపేట), మార్చి 2: యూనిక్ కంపెనీ ఏజెంట్ పేరుతో నెల నెల పొదుపు డబ్బులు వసూలు చేసి మోసం చేసిన ఘటన ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్ గ్రామంలో చోటుచేసుకుంది. వెంకటాపూర్ గ్రామానికి చెందిన సునీల్ యూనిక్ కంపెనీ ఫేక్ ఏజెంట్ అని తేలడంతో బాధితులు ఆయన ఇంటిని ముట్టడించారు. పొదుపు చేసిన డబ్బులను తిరిగి ఇవ్వాలని డిమాండ్ చేశారు. సుమారు 500 మంది బాధితుల నుంచి మూడు కోట్లకు పైగా డబ్బులు వసూలు చేసినట్లు బాధితులు పేర్కొన్నారు. మోసం చేసిన వ్యక్తి ఇంటిని ముట్టడించిన ఫలితం లేకపోవడంతో న్యాయం చేయాలంటూ బాధితులు పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించారు. బాధితుల ఫిర్యాదు మేరకు పూర్తి వివరాలు సేకరించి బాధితులకు న్యాయం చేస్తామని ఎస్సై రమాకాంత్ హామీ ఇచ్చారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

వీణవంక,మార్చి2: మండలంలోని బేతిగల్ గ్రామానికి చెందిన తాటికొండ రమణారెడ్డి ఇంట్లో దొంగలు చోరీకి పాల్పడ్డారు. నాలుగు రోజుల క్రితం రమణారెడ్డి కుటుంబం హైదరాబాద్‌కు వెళ్లగా ఇంట్లో ఎవరూ లేని సమయం చుసిన గుర్తు తెలియని వ్యక్తులు తలుపులు పగలగొట్టి ఇంట్లోకి చొరబ్డారు. బీరువా తెరిచి మంగళహారతులు,కాళ్ల పట్టీలు, మొలతాడు, దాదపు 55 తులాల వెండి, 16,500 విలువ గల వస్తువులు ఎత్తుకెళ్లినట్టు రమణారెడ్డి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై వంశీకృష్ణ తెలిపారు.

కొండగట్టులో భక్తుల రద్దీ

మల్యాల, మార్చి 2: కొండగట్టు అంజనేయస్వామి సన్నిధానం శనివారం భక్తులతో కిటకిటలాడింది. వేకువజాము నుంచే భక్తులు స్వామి వారి దర్శనానికి బారులు తీరారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఈవో వెంకటేష్, ఏఈవో అంజయ్య, పర్యవేక్షకులు సునీల్, శ్రీనివాస్‌శర్మ పర్యవేక్షించారు.

వ్యవసాయ క్షేత్రాలను పరిశీలించిన శాస్త్రవేత్తలు

హుజూరాబాద్‌రూరల్, మార్చి 2: మండలంలోని ధర్మరాజుపల్లి, రాంపూర్, సిర్సపల్లి గ్రామాల్లో శనివారం జగిత్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు డాక్టర్ డి. శ్రీలత, డాక్టర్ బి. శ్రీనివాస్, డాక్టర్ బలరాం, డాక్టర్ సాయినాథ్‌లు పర్యటించారు. వరిలో పిలక దశలో మొగి పురుగు ఆశిస్తే పిలకలు ఎండి చనిపోతాయని, వరి పిలక దశలో కార్టప్ హైడ్రోక్లోరైడ్ ఎకరానికి 400 గ్రా. 160-200 లీటర్ల నీటిలో కలుపుకొని పిచికారి చేయాలన్నారు. అగ్గి తెగుల నివారకు ట్రై సైక్లోజోల్ ఎకరానికి 120 గ్రా. పిచికారి చేయాలన్నారు. ఏడీఏ సునీత, ఏవో సునీల్‌కుమార్, ఏఈవోలు ఉన్నారు.

అక్రమంగా నిల్వ చేసిన రేషన్ బియ్యం పట్టివేత


మెట్‌పల్లిలో నిల్వ చేసిన రేషన్ బియ్యం

మెట్‌పల్లి, మార్చి 2: పట్టణంలో అక్రమంగా నిలువ చేసిన రేషన్ బియ్యంను శనివారం ఎస్సై చిరంజీవి పట్టుకున్నట్లు తెలిపారు. పట్టణంలోని శాంతినగర్ కాలనీకి చెందిన కొండపల్లి మల్లయ్య ఇంట్లో అక్రమంగా రేషన్ బియ్యంను నిలువ చేసిన పక్క సమచారం మేరకు దాడులు చేయడం జరిగిందన్నారు. పట్టణాలు, గ్రామాల్లో తన మనుషులతో రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసిన వాటిని తన ఇంట్లో నిలువ చేసి వాటిని ఇతర ప్రదేశాలకు సరఫరా చేయడానికి సిద్ధంగా ఉంచారు. విషయం తెలుసుకొని దాడులు నిర్వహించగా అక్రమంగా నిలువ చేసిన 20క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుకొని సాధీనం చేసుకున్నట్లు తెలిపారు. బియ్యం నిలువ చేసిన కొండపల్లి మల్లయ్యపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. పట్టుకున్న బియ్యంను రెవెన్యూ అధికారులకు అప్పగించనున్నట్లు ఎస్సై తెలిపారు.

అధికారులకు నెమలి అప్పగింత

ధర్మారం,మార్చి2: మండల కేంద్రంలోగల క్రీడా ప్రాంగణం సమీపంలో లభ్యమైన నెమలిని గోవర్ధన్ అనే రైతు అటవీ శాఖ అధికారులకు అప్పగించాడు. శనివారం గుట్టల మీది నుంచి వచ్చిన నెమలి నడవలేని స్థితిలో ఉండగా ఆ నెమలిని గోవర్ధన్ పట్టుకుని అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించి అప్పగించాడు.

సుల్తానాబాద్ సీఐ బాధ్యతల స్వీకరణ

సుల్తానాబాద్, మార్చి 2: సుల్తానాబాద్ పోలీస్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా జి. సుబ్బారెడ్డి శనివారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఇంతకు ముందు ఇక్కడ పని చేసిన జగదీష్ ఇతర ప్రాంతాలకు బదిలీపై వెళ్లగా ఆయన స్థానంలో సుబ్బారెడ్డి సీఐడీ విభాగం వరంగల్‌లో పనిచేస్తూ సుల్తానాబాద్ సీఐగా బదిలీపై వచ్చారు.

సమతా కుంభ్ బ్రహ్మోత్సవాల్లో కేడెట్ల సేవలు

కోల్‌సిటీటౌన్, మార్చి 2: హైదరాబాద్‌లోని శంషాబాద్ ముచింతల్‌లో జరిగిన సమతా కుంభ్ 2024 బ్రహ్మోత్సవాల్లో భారత్ స్కౌట్స్, గైడ్స్ సింగరేణి డిస్ట్రిక్ట్ అసోసియేషన్ తరుపున సేవలందించారు. ఫిబ్రవరి 24వ తేది నుంచి ఈనెల 2వ తేది వరకు సమతాకుంభ్‌లో స్కౌట్స్, గైడ్స్ ఎ.దేవేందర్, కె.బుచ్చయ్య, డి.కుమార్, టి.పవన్, కె.శ్రీనివాస్, జి.రాజ్‌కుమార్‌లు సేవలు చేశారు. సేవలను అభినందిస్తూ సమతా కుంభ్ బ్రహ్మోత్సవాల నిర్వహణ కమిటీ బాధ్యులు చిన్నజీయర్‌స్వామి చేతుల మీదుగా అభినందన పత్రాలు, జ్ఞాపికలు అందుకున్నారు. ఈ అవకాశం కల్పించిన సింగరేణి యాజమాన్యానికి, భారత్ స్కౌట్స్ గైడ్స్ సింగరేణి డిస్ట్రిక్ట్ అసోసియేషన్‌కు వారు కృతజ్ఞతలు తెలిపారు.

గూడెం జూనియర్ లైన్‌మన్ సస్పెన్షన్

ఓదెల, మార్చి 2: మండలంలోని గూడెం జూనియర్ లైన్‌మన్ అజయ్‌ని సస్పెండ్ చేసినట్లు శనివారం పెద్దపల్లి ట్రాన్స్‌కో డీఈ దాసరి తిరుపతి తెలిపారు. కాల్వశ్రీరాంపూర్ సబ్ డివిజన్ పొత్కపల్లి సెక్షన్ పరిధి గూడెం లైన్‌మెన్ అజయ్ విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో పాటు వినియోగదారుల నుంచి వసూలు చేసిన విద్యుత్ బిల్లులు సకాలంలో సంస్థకు చెల్లించకుండా అలసత్వం వహించినట్లు ఆరోపణలు, ఫిర్యాదులు రావడంతో విచారణ జరిపినట్లు పేర్కొన్నారు. విచారణలో ఆరోపణలు నిర్ధారణ కావడంతో శాఖపరమైన చర్యల్లో భాగంగా అజయ్‌ని విధుల నుంచి సస్పెండ్ చేసినట్లు తెలిపారు.

సంక్షిప్త సమాచారం

ముత్తారం : మండలంలోని లక్కారం గ్రామపంచాయతీ పరిధిలో శనివారం నుంచి చిరుతల రామాయణం కార్యక్రమాన్ని గ్రామస్తులు ఏర్పాటు చేసుకున్నారు. శనివారం రాత్రి కళ్యాణం, ఆదివారం వాలివధ సుందరకాండ, సోమవారం లంకా దహనం కుంభకర్ణ వధ, మంగళవారం రావణ వధ, బుధవారం సీతారాముల పట్టాభిషేక కార్యక్రమాలు ఏర్పాటు చేయనున్నట్టు చిరుతల రామాయణం కమిటీ తెలిపారు. ప్రాచీన కళ చిరుతల రామాయణాన్ని ఆదరించి వీక్షించాలని వారు కోరారు.

కమాన్‌పూర్ : మండలంలోని జూలపల్లి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, పెన్నుల పంపిణీ కార్యక్రమం శనివారం జరిగింది.మాజీ స్పీకర్, దివంగత శ్రీపాదరావు జయంతిని పురస్కరించుకొని పరీక్ష ప్యాడ్లను, పెన్నులను కాంగ్రెస్ నాయకులు రెబల్ రాజ్‌కుమార్, సంతోష్‌కుమార్ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుజాత పంపిణీ చేశారు.

పాలకుర్తి : ద్విచక్ర వాహనదారులు హెల్మెట్‌ను తప్పనిసరిగా ధరించాలని బసంత్‌నగర్ ఎస్సై ఆర్ స్వామి అన్నారు. శనివారం జాతీయా రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా పట్టణంలో హెల్మెట్ ఉపయోగంపై వాహనదారులకు అవగాహన కల్పించి బైక్ ర్యాలీ నిర్వహించారు. పలువురు వాహనదారులు, స్థానిక పోలీసులు పాల్గొన్నారు.

పాలకుర్తి : అత్యవసర సమయంలో రక్త దానం చేసి మానవత్వాన్ని చాటాడు ఓ పోలీస్ కానిస్టేబుల్. రంగాపూర్ గ్రామానికి చెందిన జి సరిత అనే మహిళ రక్తహీనతతో బాధపడుతూ పెద్దపల్లి పట్టణంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. ఆమెకు బి పాజిటివ్ రక్తం అవసరం కాగా, బసంత్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న కర్నెకంటి సురేష్ రక్తదానం చేశాడు. ఎస్సై ఆర్ స్వామితోపాటు తోటి పోలీసులు సురేష్‌ను అభినందించారు.

పాలకుర్తి : మండలంలో అక్రమ ఇసుక రవాణాను అరికట్టాలని కోరుతూ శనివారం కన్నాల గ్రామపంచాయతీ ఉపసర్పంచ్ పుట్ట రంజిత్ బసంత్‌నగర్ ఎస్సై ఆర్ స్వామికి వినతిపత్రం అందించారు. వెంట ఇస్లావత్ సమ్మయ్య నాయక్, భూతగడ్డల తిరుపతి, దండుగుల మల్లేష్ ఉన్నారు.

పాలకుర్తి : బసంత్‌నగర్ గ్రామానికి చెందిన జెట్‌పట్ రమేష్ జనవరి నెలలో సెల్ ఫోన్ పోగొట్టుకున్నాడు. బాధితుడు బసంత్‌నగర్ పోలీసులు ఫిర్యాదు చేయగా, శనివారం ఎస్సై స్వామి అప్పగించారు.

రామగిరి : మండలంలోని కల్వచర్ల గ్రామానికి చెందిన రోడ్డ శంకర్ గత కొన్నినెలలుగా కిడ్నీ సమస్యతో బాధపడుతున్నడనే విషయాన్ని గుర్తించి శనివారం సింగరేణిలో పని చేసే చిరు ఉద్యోగి రేండ్ల కుమారస్వామి తన వంతు సహాయంగా రూ.5వేలను అందజేశారు. రోడ్డ రాములు, రొడ్డ సంపత్, విజయ్, బూడిద సంపత్, కన్నల రమేశ్, రేండ్ల మధుసూదన్, ముత్యం నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ధర్మారం : ధర్మారం తహసీల్దార్ కార్యాలయంలో శనివారం ఎంఆర్ఐ(గిర్దావరి)గా వరలక్ష్మి బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన ఎంఆర్ఐ రమ్య బదిలీ కావడంతో పెద్దపల్లి కలెక్టరేట్‌లో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న వరలక్ష్మిని ధర్మారం ఎంఆర్ఐగా నియమిస్తూ ఉత్వర్వులు జారీ చేశారు. శనివారం ఆమె బాధ్యతలు స్వీకరించారు.

మాజీ స్పీకర్ శ్రీపాదరావుకు ఘన నివాళి



కలెక్టరేట్‌లో శ్రీపాదరావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అధికారులు



రామయ్యపల్లిలో శ్రీపాదరావు విగ్రహానికి నివాళులర్పిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు

పెద్దపల్లి కల్చరల్, మార్చి 2 : మాజీప స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాదరావు జయంతి వేడుకలను శనివారం కలెక్టరేట్‌లో ఘనంగా నిర్వహించారు. అదనపు కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌లాల్ జ్యోతి ప్రజ్వలన చేసి శ్రీపాదరావు చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. శ్రీపాదరావు జీవిత ప్రస్థానాన్ని కలెక్టరేట్ సి విభాగం సూపరింటెండెంట్ ప్రకాష్ చదివి వినిపించారు. అదనపు కలెక్టర్ శ్యామ్ ప్రసాద్‌లాల్ మాట్లాడుతూ తెలంగాణ ఏర్పడిన తర్వాత అనేక మంది నాయకుల జయంతి వేడుకలను అధికారికంగా నిర్వహిస్తున్నామని, అదే రీతిలో ప్రభుత్వ ఆదేశాల మేరకు దుద్దిళ్ల శ్రీపాదరావు జయంతి జరుపుకోవడం సంతోషక రమన్నారు. కలెక్టరేట్ పరిపాలన అధికారి శ్రీనివాస్, అధికారులు సిబ్బంది, పాల్గొన్నారు.

కళ్యాణ్‌నగర్ : శ్రీపాదరావు జయంతి సందర్భంగా గోదావరిఖని బస్టాండ్ వద్ద ఉన్న శ్రీపాదరావు విగ్రహానికి రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. మేయర్ బంగి అనీల్ కుమార్, కార్పొరేటర్లు బొంతల రాజేష్, మహంకాళి స్వామి, ఎండీ ముస్తాఫా, నాయకులు కాల్వ లింగస్వామి, తిప్పారపు శ్రీనివాస్, పెద్దెల్లి ప్రకాష్, నాయిని ఓదెలు, బొమ్మక రాజేష్, ఫజల్ బేగ్, దొబ్బల శ్రీనివాస్, కళ్యాణి సింహాచలం పాల్గొన్నారు. గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు తిప్పారపు శ్రీనివాస్ ఆధ్వర్యంలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. నగర అధ్యక్షుడిగా బొంతల రాజేష్, పెద్దెల్లి ప్రకాష్, చుక్కల శ్రీనివాస్, నాయిని ఓదెలు, కొప్పుల శంకర్, బొమ్మక రాజేష్, సింహాచలం, ఆడెపు రవి, మల్లేష్, వినయ్, నాజీమొద్దీన్, శివ పాల్గొన్నారు.

పెద్దపల్లి రూరల్: మాజీ స్పీకర్ శ్రీపాదరావు జయంతిని పెద్దపల్లి మండలంలో ఘనంగా నిర్వహించారు. పెద్దకల్వలలోని మదర్‌థెరిస్సా ఇంజనీరింగ్ కళాశాలలో శ్రీపాదరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కళాశాల వ్యవస్థాపకులు ఎడవల్లి నవీన్‌కుమార్, డైరెక్టర్ నవత, ప్రిన్సిపాల్ శ్రీనివాస్, విభాగాధిపతులు, అకౌంట్స్ ఆఫీసర్ పవన్‌కుమార్ పాల్గొన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో శ్రీపాదరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు.డిప్యూటీ తహసీల్దార్ తిరుపతితో పాటు రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఓదెల : మండల రెవెన్యూ, మండల పరిషత్ కార్యాలయాల్లో శనివారం మాజీ స్పీకర్ శ్రీపాదరావు జయంతిని నిర్వహించారు. చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తహసీల్దార్ యాకయ్య, ఎంపీడీవో తిరుపతి, డిప్యూటీ తహసీల్దార్ అనిల్ కుమార్, ఆర్ఐలు రాజేందర్, నర్సింగరావు సిబ్బంది పాల్గొన్నారు. కాగా, కొలనూర్‌లో ఉద్యమకారులు గుండేటి ఐలయ్య ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో నివాళ్లు అర్పించారు. మాజీ సర్పంచ్ సామ శంకర్, కాంగ్రెస్ నాయకులు గాజుల శివశంకర్, గుండేటి శ్రీకాంత్, కందుల సదాశివ, జంగం కోమురయ్య, మధు, గాజుల గోపాలకృష్ణ, సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

సుల్తానాబాద్: మాజీ స్పీకర్ శ్రీపాదరావు జయంతిని సుల్తానాబాద్‌లో కాంగ్రెస్ పార్టీ నాయకులు, వివిధ ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులు ఘనంగా నిర్వహించారు. సుల్తానాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే విజయరమణారావు పాల్గొని శ్రీపాదరావు చిత్రపటానికి పూల మాలలువేసి నివాళులర్పించారు. మున్సిపల్ కార్యాలయంలో ఛైర్‌పర్సన్ గాజుల లక్ష్మిరాజమల్లు జయంతి కార్యక్రమంలో పాల్గొని నివాళులర్పించారు. కమిషనర్ వేణుమాదవ్, కౌన్సిలర్లు,ఉద్యోగులు పాల్గొన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన జయంతి వేడుకల్లో తహసీల్దార్ మధుసూదన్‌రెడ్డి, ఆర్ఐలు, ఉద్యోగులు పాల్గొన్నారు.

యైటింక్లయిన్‌కాలనీ : మాజీ స్పీకర్ శ్రీపాదరావు జయంతిని కాంగ్రెస్, అనుబంధ సంఘాలు శనివారం ఘనంగా నిర్వహించాయి. శ్రీపాదరావు విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులలర్పించిన నాయకులు అనంతరం కేక్‌కట్ చేశారు. పట్టణాధ్యక్షుడు గుండేటి రాజేష్, రాజిరెడ్డి, అక్బర్‌అలీ, శంకర్‌నాయక్, రేశవేనికేశవులు, సునీతసాంబయ్య, వై తిరుపతి, చక్రపాణి, దుర్గాప్రసాద్, తిరుప తిరెడ్డి, కిషన్ నాయక్, సారయ్యనాయక్, సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నా రు. వెంకట్రావ్‌పల్లె గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో కార్యదర్శి రమ, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. పార్టీ కార్యాలయంలో వీరస్వామి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో శ్రీపాదరావు చిత్రపటానికి పూలమాలలు వేసి కేక్ కట్ చేశారు. చాట్ల సదానందం, విజేందర్‌రెడ్డి, శనిగరం తిరుపతి, రబ్బాని పాల్గొన్నారు.

ముత్తారం : మాజీ స్పీకర్ శ్రీపాదరావు జయంతిని మండలంలో ఘనంగా నిర్వహించారు. తహసీల్దార్ సుమన్, ఎంపీడీవో లలితలు శ్రీపాదరావు చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నిర్వహించారు. కేశనపల్లిలో జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు, మాజీ జడ్పీటీసీ చొప్పరి సదానందం, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దొడ్డ బాలాజీ, పీఏసీఎస్ ఛైర్మన్ అల్లాడి యాదగిరిరావులు శ్రీపాదరావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తాజా మాజీ సర్పంచులు సిరికొండ బక్కారావు, తూటి రజిత రఫీ, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శివకుమార్, మండల మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు గోవిందుల పద్మ ఆనంద్, మైనార్టీ సెల్ అధ్యక్షులు వాజీద్ పాషా, మండల కాంగ్రెస్ నాయకులు గాదం శ్రీనివాస్, బక్కతట్ల కుమార్, చెల్కల జితేందర్, పెగడ కుమార్, సింగనవేన సమ్మయ్య, సదానందం, ఓదెలు, సంపత్, చంద్రమౌళి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కమాన్‌పూర్ : మండల కేంద్రంలో శనివారం మాజీ స్పీకర్ శ్రీపాదరావు జయంతిని కాంగ్రెస్ నాయకులు ఘనంగా జరుపుకున్నారు. శ్రీపాదరావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వైనాల రాజు, మాజీ ఎంపీపీ కోలేటి మారుతి, సింగిల్ విండో ఛైర్మన్ ఇనుగంటి భాస్కర్‌రావు, మాజీ ఎంపీపీ మల్యాల రామచంద్రంగౌడ్, సయ్యద్ అన్వర్, గాండ్ల మోహన్, రఫీక్, పెండ్యాల రాజు, జూలపల్లి మాజీ ఎంపీటీసీ బొల్లంపల్లి తిరుపతిగౌడ్, జూలపల్లి ఎంపీటీసీ శివ శంకరయ్య, చొప్పరి తిరుపతి, సాయిరాం, మల్యాల తిరుపతి, కనకయ్య, సదయ్య తదితరులు ఉన్నారు.

జూలపల్లి : మాజీ స్పీకర్ శ్రీపాదరావు జయంతి వేడుకలను కాంగ్రెస్ నాయకులు, అధికారులు ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాల్లో, ముఖ్యకూడళ్లలో శ్రీపాదరావు చిత్రపటాలకు పూలమాలలు వేసి ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులు నివాళులర్పించారు. తహసీల్దార్ బషిరొద్దిన్, ఎంపీడీవో పద్మజ, ఎంపీపీ రమాదేవి, విండో ఛైర్మన్ వేణుగోపాల్‌రావు, నాయకులు గండు సంజీవ్, కొంకటి భూషనం, మానుమండ్ల శ్రీనివాస్, ముమ్మాడి రవి, ఎండి పకీర్, కందుకూరి అంజయ్య, అజ్జుబాయి, కనుకయ్య పాల్గొన్నారు.

కాల్వశ్రీరాంపూర్ : మాజీ స్పీకర్ శ్రీపాదరావు జయంతి వేడుకలను మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. మాజీ ఎంపీపీ గోపగోని సారయ్యగౌడ్, మండల పార్టీ అధ్యక్షుడు సదయ్య, కాంగ్రెస్ నాయకులు శ్రీపాదరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ మండల అధ్యక్షుడు గాజనవేన సదయ్య, నాయకులు ఎండీ మునీర్, పులి ఇంద్రకరణ్‌రెడ్డి, శివరామకృష్ణ, మాదాసి సతీష్, సబ్బని రాజమల్లు, మొగిలి సదానందం, దాసరి నరేందర్, మేడి అశోక్‌గౌడ్, ఆషాడపు సురేష్, రహీం, శ్రీపతి రాజ్‌కుమార్, కొంతం మధుకర్, కట్కూరి రాజిరెడ్డి, ఐలయ్య, గోవర్ధన్, కొంతం మహేందర్ పాల్గొన్నారు.

రామగిరి : మాజీ స్పీకర్ శ్రీపాదరావు జయంతి సందర్భంగా రామయ్యపల్లిలో శ్రీపాదరావు విగ్రహానికి మంత్రి శ్రీధర్‌బాబు గజమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం నాగేపల్లి, సెంటినరీకాలనీ ఐఎన్‌టీయుసీ కార్యాలయంలో శ్రీపాదరావు చిత్రపటానికి పూలమాలలు వేశారు. ఎంపీపీ ఆరెల్లి దేవక్క, మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తొట్లతిరుపతియాదవ్, నాయకులు తొటచంద్రయ్య, కొట రవీందర్ రెడ్డి, ఎండి మంజూర్, రజిత, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



ఖనిలో శ్రీపాదరావు విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్



సుల్తానాబాద్‌లో నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

నిరుపయోగంగా ఆర్‌అండ్‌బీ విశ్రాంతి గృహం

- అతిథుల విడిదికి అసౌకర్యం - పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు

సుల్తానాబాద్, మార్చి 2 : సుల్తానాబాద్ పట్టణంలోని ఆర్‌అండ్‌బీ అతిథిగృహం నిరుపయోగంగా మారింది. దీంతో వివిధ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు ఈ ప్రాంతానికి వచ్చే ముఖ్యమైన అధికారులు, ప్రజాప్రతినిధులు విశ్రాంతి తీసుకోవడానికి ఇబ్బందులు తలెత్తుతున్నాయి. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడ్డ తొలినాళ్లలో సుల్తానాబాద్ పట్టణంలోని ఆర్‌అండ్‌బీ విశ్రాంతి భవనం బాగానే ఉండేది. అయితే జిల్లా కేంద్రం పెద్దపల్లి కావడంతో సుల్తానాబాద్‌లో ఉన్న రోడ్లు, భవనాల శాఖ కార్యాలయాన్ని పెద్దపల్లికి తరలించారు. దాంతో అప్పటినుంచి ప్రభుత్వ విశ్రాంతి భవనాన్ని మూసివేశారు. ప్రస్తుతం భవనం ఆవరణ అంతా చెత్తాచెదారంతో నిండిపోయి ఉంది. విశ్రాంతి గదులన్నీ శిధిలావస్థకు చేరాయి. ఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యే చొరవ తీసుకుని విశ్రాంతి భవనాన్ని వినియోగంలోకి తేవాలని పలువురు కోరుతున్నారు.



నిరుపయోగంగా విశ్రాంతి భవనం



ఆర్జీ-2లో ఘనంగా శ్రీపాదరావు జయంతి

యైటింక్లయిన్‌కాలనీ, మార్చి 2: మాజీ స్పీకర్ దుద్దిల్ల శ్రీపాదరావు జయంతిని శనివారం ఆర్జీ-2 జీఎం కార్యాలయంలో శనివారం ఘనంగా నిర్వ హించారు. జీఎం సూర్యనారాయణ ముఖ్య అతిథిగా హాజరై శ్రీపాదరావు చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఏఐటీయూసీ బ్రాంచి సెక్రెటరీ జిగురు రవీందర్, అధికార ప్రతినిధి రాజేంద్రప్రసాద్, అధికా రులు వెంకటరామచంద్ర, బుక్యదేశాయి, అనిల్‌కుమార్, వినయ్‌సాగర్, ప్రతా పగిరి రాజు, వేణుగోపాల్, వంశీధర్, జీఎం ఆఫీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రామగిరి : మాజీ స్పీకర్ శ్రీపాదరావు సేవలు మరువలేనివని ఆర్జీ-3 జీఎం సుధాకర్‌రావు అన్నారు. శనివారం జీఎం కార్యాలయంలో శ్రీపాదరావు జయంతిని పురస్కరించుకొని ఏర్పాటుచేసిన కార్యక్రమానికి జీఎం ముఖ్యఅతిథిగా హాజరై చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అధికారులు ఎలీషా, రఘుపతి, వెంకటరమణ, చం ద్రశేఖర్, నాగేశ్వర్‌రావు, రాజారెడ్డి, కాశీ విశ్వేశ్వర్‌రావు, సుధాకర్, శ్రీనివాస్, నాగ రాజు, గుర్రం శ్రీహరి, రాజేశ్వరీ పాల్గొన్నారు.

ఫిబ్రవరి నెల ఆర్జీ-2 ఉత్పత్తి 109 శాతం

యైటింక్లయిన్‌కాలనీ, మార్చి 2: గడిచిన ఫిబ్రవరి నెలలో ఆర్జీ-2 ఏరియా 109శాతం బొగ్గు ఉత్పత్తి సాధించినట్టు జీఎం సూర్యనారాయణ ప్రకటనలో తెలిపారు. ఫిబ్రవరి టార్గెట్ 9,77,700టన్నులకు 10,70,127 టన్నులు (110శాతం) సాధించినట్టు తెలిపారు. ఓబీ వెలికితీత టార్గెట్ 51,70,000 క్యూబిక్ మీటర్లు కాగా, 43,21,640 క్యూబిక్ మీటర్లు సాధించినట్టు పేర్కొన్నారు. ఓసీపీ-3 సీహెచ్‌పీ నుంచి 10,45,808 టన్నుల బొగ్గు రవాణా చేసినట్టు పేర్కొన్నారు. 2023-24 ఆర్థిక సంవత్సరానికి ఆర్జీ-2 ఏరియాకు కేటాయించిన 86,20,000 టన్నులకు 85,57,699 టన్నులు(99శాతం) ఉత్పత్తి సాధించామన్నారు. నిర్దేశిత లక్ష్యాన్ని అధిగమించేలా ఉద్యోగులు కృషి చేయాలని జీఎం కోరారు.

జలాశయాలపై 800మెగావాట్ల సోలార్ ప్లాంట్లు

- తక్కువ ధరలో విద్యుత్ ఉత్పత్తికి ప్రయత్నాలు - సింగరేణి సీఎండీ బలరాం



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న సీఎండీ బలరాం

గోదావరిఖని, మార్చి 2: సింగరేణి సంస్థ త్వరలో భారీ జలాశయాలపై 800మెగావాట్ల సోలార్ ప్లాంట్లను ఏర్పాటు చేసేందుకు సిద్ధంగా ఉందని సింగరేణి సీఎండీ బలరాం పేర్కొన్నారు. ప్రభుత్వం అనుమతిస్తే ఈ ప్లాట్ల నిర్మాణం చేపడుతామన్నారు. శనివారం హైదరాబాద్ సింగరేణి భవన్‌లో ఆయన సింగరేణి విద్యుత్ విభాగం డైరెక్టర్ (ఈఅండ్‌ఎం) సత్యనారాయణరావుతో పాటు ఉన్నతాధికారులతో ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఇప్పటికే సింగరేణి వ్యాప్తంగా 234మెగావాట్ల సోలార్ ప్లాంట్లను ఏర్పాటు చేసిన సింగరేణి భారీ స్థాయిలో సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు సిద్ధమవుతుందన్నారు. సంస్థ వ్యాపార విస్తరణలో భాగంగా నూతనంగా ఈ విద్యుత్ ప్రాజెక్టులపై చర్చించారు. లోయర్ మానేరు డ్యామ్‌పైన 300మెగావాట్ల సోలార్ ప్లాంట్, మల్లన్న జలాశయంపై 500మెగావాట్ల ప్లాంటు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని బలరాం సంబంధిత అధికారులను ఆదేశించారు. మానేరు డ్యాంపై 300మెగావాట్ల ప్లాంట్ ఏర్పాటుకు డీపీఆర్ సిద్ధంగా ఉంది కనుక రాష్ట్ర ప్రభుత్వ అనుమతితో నిర్మాణం చేపట్టేందుకు కంపెనీ సిద్ధంగా ఉందన్నారు. మల్లన్న సాగర్‌పై తలపెట్టి రెండు 250మెగావాట్ల ప్లాంట్ల ఏర్పాటుకు సంబంధించి డీపీఆర్‌ను వెంటనే రూపొందించాలని ఆయన ఆదేశించారు. రాజస్థాన్ రాష్ట్రంలో సింగరేణి ఏర్పాటు చేయనున్న 500మెగావాట్ల సోలార్ ప్లాంట్‌కు సంబంధించిన కార్యాచరణపై కూడా బలరాం సమీక్షించారు. ఈ ప్రాజెక్టుపై రూపొందించిన డీపీఆర్‌పై మరింత లోతుగా అధ్యయనం జరుగాలని, తక్కువ ధరకే విద్యుత్ ఉత్పత్తి జరిగే విధంగా ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలని ఆయన అన్నారు. జైపూర్ సింగరేణి విద్యుత్ కేంద్రం పని తీరుపై కూడా ఆయన ఈ సందర్భంగా సమీక్షించారు. ప్రస్తుతం 1200 మెగావాట్ల ప్లాంట్‌కు అదనంగా అదే ప్రాంగణంలో నిర్మించ తలపెట్టిన 800మెగావాట్ల సూపర్ క్రిటికల్ థర్మల్ విద్యుత్ కేంద్రానికి సంబంధించిన టెండర్ ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని ఆయన అధికారులకు సూచించారు. ఈ రకమైన వ్యాపార విస్తరణ చర్యల్లో భాగంగా రాష్ట్రంలో పవన విద్యుత్ కేంద్రాలు ఏర్పాటు చేయడానికి అవకాశం గల ప్రాంతాలను పరిశీలించాలని, అందుకు సంబంధించిన నివేదికను రూపొందించాలని ఆయన అధికారులను కోరారు.

ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సబివిరెడ్డి, జీఎం(సివిల్) సూర్యనారాయణ, మేనేజర్(సోలార్) జానకిరాం, విద్యుత్ చీఫ్ ఎస్‌వీకేవీ రాజు, ఓఅండ్‌ఎం అధికారి జేఎస్ సింగ్, డీజీఎంలు వేణుగోపాల్, ప్రభాకర్ పాల్గొన్నారు.

'పెద్దపల్లి ఎంపీ టికెట్ మాదిగలకు కేటాయించాలి'

పెద్దపల్లి టౌన్, మార్చి 2: పార్లమెంట్ ఎన్నికల్లో పెద్దపల్లి ఎంపీ టికెట్‌ను అన్ని రాజకీయ పార్టీలు మాదిగలకు కేటాయించాలని ఆల్ ఇండియా అంబేద్కర్ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు మామిడిపెల్లి బాపయ్య డిమాండ్ చేశారు. పెద్దపల్లి ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఆయన మాట్లాడుతూ పార్లమెంట్ పరిధిలో అత్యధిక ఓట్లు మాదిగలవే ఉన్నాయన్నారు. సమావేశంలో కోటగిరి పాపయ్య, కాంపెల్లి ప్రభాకర్, బొంపెల్లి నారాయణ, అరేపల్లి రాకేష్, సంకనపల్లి లక్ష్మన్, తదితరులు పాల్గొన్నారు.

అమరులకు ఎమ్మార్పీఎస్ నివాళి

కళ్యాణ్‌నగర్, మార్చి 2: ఎస్సీ వర్గీకరణ కోసం పోరాడిన అమరులను స్మరిస్తూ శుక్రవారం రాత్రి గోదావరిఖని చౌరస్తాలో నివాళులర్పించారు. ఈసందర్భంగా ఎమ్మార్పీఎస్ నాయకులు రాసపెల్లి రవికుమార్ ఎస్సీ వర్గీకరణ చేసే వరకు పోరాటం ఆగదన్నారు. కార్యక్రమంలో నాయకులు ఉప్పులేటి పర్వతాలు, కుమార్, కన్నూరి ధర్మేందర్, రాజలింగం, సంపత్, సదానందం, కుమారస్వామి, నర్సింగారావు, వెంకన్న, శ్యాం పాల్గొన్నారు.

భీమ్ జ్యోతి ర్యాలీని విజయవంతం చేయాలి

పెద్దపల్లి రూరల్, మార్చి 2: పెద్దపల్లిలో ఈనెల 15న నిర్వహించనున్న భీంజ్యోతి ర్యాలీని విజయవంతం చేయాలని మాదిగశక్తి జిల్లా కన్వీనర్ కల్లెపల్లి రవి పిలుపునిచ్చారు. కాన్షీరాం జయంతి రోజున జిల్లాకేంద్రంలో నిర్వహిస్తున్న ర్యాలీ కరపత్రాలను మండలంలోని రాఘవపూర్‌లోని గుట్ట జాంబవ చక్రవర్తి నిర్మాణస్థలం వద్ద శనివారం ఆవిష్కరించారు. ఈకార్యక్రమంలో కుమ్మరి సదయ్య, కుమ్మరి సందీప్, కుమ్మరి శ్రీశైలం, కల్లెపల్లి సతీష్, కల్లెపల్లి కిషోర్, కుమ్మరి మోహన్ బాబు, కుమ్మరి చిన్న సందీప్, కుమ్మరి శివ, మోదుంపల్లి చిన్న అంజయ్య, మోదుంపల్లి పర్వతాలుతో పాటు పలువురు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

ఓదెల, మార్చి2: మండలంలోని గోపరపల్లిలో ఈజీఎస్ కింద మంజూరైన రూ.ఐదు లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులను శనివారం ఎంపీటీసీ గోపు లావణ్య, నారాయణరెడ్డి పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సింగిల్‌విండో మాజీ ఛైర్మన్ గోపు నారాయణరెడ్డి, కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బైరి రవి గౌడ్, ప్రత్యేక అధికారి స్రవంతి, పోలపల్లి బుచ్చిరెడ్డి, తుంగాని శ్రీనివాస్ యాదవ్, గ్రామపంచాయతీ సెక్రటరీ, అలాగే గోపు కుమార్ రెడ్డి, బండి రవి, జంగ శ్రీనివాస్, కిషన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఖనిలో అపూర్వ సమ్మేళనం



ఖనిలో సమావేశమైన పూర్వవిద్యార్థులు

కోల్‌సిటీటౌన్, మార్చి 2: సింగరేణి సెక్టార్-2 పాఠశాలలో పదో తరగతి ఇంగ్లీష్ మీడియం(1985-86) బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు శనివారం 38 ఏళ్ల తర్వాత కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆనాటి మధుర స్మృతులను నేమరేసుకున్నారు. ఈ కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు పెద్దపల్లి సత్యనారాయణ, మాదిరెడ్డి శ్రీధర్, తిరుమల శెట్టి, నాగరాజు, కోగంటి రవి, దొంగరి శ్రీనివాస్, నజీరుద్దీన్, రేగడి రాజేశం, ఉల్లాల రవి, రాజరాజేశ్వరి(కెన్యా), డి.రాజేశ్వరి, రహీమున్నీసా, రాధా విజయనిర్మల, ఇందిర, శాంత, శారద, ఎం.రాజేశ్వరితో పాటు 20 మంది పాల్గొన్నారు.

శివాలయంలో ప్రత్యేక పూజలు

పెద్దపల్లి రూరల్, మార్చి 2 : మండలంలోని రాగినేడులో స్వయంభూ వెలిసిన శ్రీ నాగలింగేశ్వర స్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా అర్చకులు తనుగుల వెంకటేశ్వర శర్మ ఆలయంలో నాగలింగేశ్వర స్వామికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఛైర్మన్ గుమ్మడి విజయ్ మాట్లాడుతూ మహాశివరాత్రి సందర్భంగా ఆలయంలో ప్రత్యేక ఏర్పాట్లు చేపడుతున్నట్లు , శివరాత్రికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సౌకర్యాలు కల్పిస్తున్నట్లు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

ఘనంగా పోచమ్మ బోనాలు

పెద్దపల్లి రూరల్, మార్చి 2: మండలంలోని కాపులపల్లిలో గ్రామ దేవతలైన పోచమ్మ తల్లి, భూ లక్ష్మీ, మహలక్ష్మీ, పోతరాజు, బొడ్రాయి ప్రతిష్ఠ నిర్వహించారు. అనంతరం పోచమ్మ కోలుపులో భాగంగా శనివారం గ్రామమంతా పోచమ్మ తల్లికి బోనాలు సమర్పించారు. ఈ సందర్భంగా మహిళలు బోనమెత్తుకోని డప్పు చప్పుళ్ల నడుమ పోచమ్మ ఆలయాలకు చేరుకోని బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గోపు కవిత-శ్రీనివాస్, ఆలయ కమిటి ఛైర్మన్, ఉప సర్పంచ్‌తో పాటు గ్రామస్థులు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలను నెరవేర్చుతాం

సుల్తానాబాద్, మార్చి2: ఎన్నికల ప్రచారంలో ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటిని దశల వారీగా నెరవేర్చి తీరతామని ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. సుల్తానాబాద్ మండలం సుద్దాల, చిన్నబొంకూర్, భూపతిపూర్ గ్రామాల్లో వివిధ అభివృద్ధి పనులకు శనివారం ఎమ్మెల్యే ప్రారంబోత్సవాలు శంకుస్థాపనలు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికలలో ఇచ్చిన ఆరు గ్యారంటీ స్కీములలో నాలుగింటిని అమలు చేసిందన్నారు. పేదలకు సంక్షేమ పథకాలు అందించేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని అన్నారు. ఈ కార్యక్రమాల్లో జడ్పీటీసీ మినుపాల స్వరూప ప్రకాష్ రావు, ఎంపీపీ బాలాజీరావు, ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

సాగు నీటిని వృథా చేయొద్దు

కమాన్‌పూర్, మార్చి 2: వారబందీ పద్ధతితో విడుదల చేస్తున్న సాగునీటి కాలువలను వ్యవసాయ, నీటి పారుదల శాఖాధికారులు శనివారం కాలువల వెంట పర్యవేక్షించారు. సాగునీటిని వృథా చేయవద్దని మండల వ్యవసాయాధికారి ప్రమోద్, నీటి పారుదల ఏఈఈ ప్రసాద్ రైతులకు వివరించారు. డీ-83 నుంచి కమాన్‌పూర్ మండలంలో 29 ఎల్, 80 ఎల్, 31 ఎల్ కాలువల ద్వారా నీటిని రైతులకు అందిస్తున్నామని చెప్పారు.

దేశ అభ్యున్నతిలో సీడబ్ల్యూసీ కీలక పాత్ర

సుల్తానాబాద్, మార్చి 2: దేశ అభ్యున్నతిలో కేంద్ర గిడ్డంగుల సంస్థ కీలక పాత్ర పోషిస్తుందని ఆ సంస్థ మేనేజర్ స్పందన అన్నారు. సుల్తానాబాద్ మండలంలోని గర్రెపల్లి గ్రామంలో ఉన్న సెంట్రల్ వేర్ హౌజింగ్ కార్పొరేషన్ (కేంద్ర గిడ్డంగుల సంస్థ) గోదాముల ఆవరణలో శనివారం 68వ వ్యవస్థాపక దినోత్సవాన్ని జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ స్పందన మాట్లాడారు. ఇన్వెస్టర్ గోదాం ఓనర్, సంస్థ మాజీ అధికారి నిరంజన్‌ను సంస్థ గురించి తన అభిప్రాయాలను వివరించారు. ఈ కార్యక్రమంలో సీడబ్ల్యూసీ ఉద్యోగులు, హమాలీలు తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాల కరపత్రాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే

ఎలిగేడు, మార్చి 2: మండలంలోని శివపల్లి గ్రామంలో ఎమ్మెల్యే నివాసంలో ఓదెల మండల కేంద్రంలోని శ్రీమల్లికార్జునస్వామి దేవస్థానంలో ఈనెల 5నుండి 15వరకు జరగబోయే మల్లికార్జునస్వామి బ్రహ్మోత్సవాలు సందర్భంగా ఆలయకమిటీ సభ్యులతో కలిసి కరపత్రాన్ని ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఓదెల ఆలయ కమిటీ ఛైర్మన్ మల్లేశం, ఈఓ సదయ్య, సభ్యులు సాంబమూర్తి, సతీష్, వెంకటస్వామి, భద్రయ్య, అర్చకులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

'ఎస్సీ వర్గీకరణ చేపట్టాలి'

ఎలిగేడు, మార్చి 2: ధర్మం గెలవాలంటే ఎస్సీ వర్గీకరణ జరిగి తీరాలని మహాజన సోషలిస్టు పార్టీ జిల్లా అధ్యక్షుడు మంథని చందు, జిల్లా అధికార ప్రతినిధి సిరిసిల్ల శంకర్‌లు అన్నారు. మండల కేంద్రంలో శనివారం ఎంఎస్‌పి మండల అధ్యక్షుడు జిల్లి రమేష్ అధ్యక్షతన ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈనెల 8న గోదావరిఖనిలో పెద్దపల్లి పార్లమెంటు స్థాయి సదస్సుకు ఎంఎస్‌పి వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ హాజరవుతున్నారని వారు పేర్కొన్నారు. ఎస్సీ వర్గీకరణ కోసం మావంతు పోరాటం చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో దాసరి కిషన్, నాయకులు కప్పంపల్లి బాపయ్య న్యాతరి పోచయ్య రాము, శంకర్, నారాయణ, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.